RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD సంపుటి : 10 సంచిక : 272 శుక్రవారం 02 - 05 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## కులగణనలో తెలంగాణను

# మోడల్ తీసుకోవాలి

- ఏడాదిలోగా ప్రక్రియ పూర్తి చేయాలి
- భారత్‌లో కులగణనపై మాట్లాడిన సీఎం రేవంత్
- కులగణనలో తెలంగాణ మోడల్ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి
- కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలని సూచన



కులగణనలో తెలంగాణ మోడల్ తీసుకోవాలని, ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కులగణన సమాజానికి ఎక్స్‌రే లాంటిదని రాహుల్ అన్నారని గుర్తు చేశారు.అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీ పంపాలని, కులగణనలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలని, కులగణన విషయంలో తెలంగాణ రాష్ట్ర అనుభవం వినియోగించుకోవాలని తెలిపారు. "కులగణన చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ విషయంలో మొదట రాహుల్‌కు అభినందనలు చెప్పాలి. కులగణన కోరుతూ రాహుల్ వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. దీనిపై రాష్ట్ర ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చాం. దేశానికి మార్గదర్శకంగా నిలిచాం. దేశంలోని అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయి. కులగణన చేయాలని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయి. కులగణన నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యవాదాలు చెబుతున్నాం. కులగణన విషయంలో కేంద్రమంత్రుల - మిగతా 2 లో

## ఆర్టీసీ లో

# సమ్మె వద్దంటే వద్దు



- ఆర్టీసీ లో సమ్మె వద్దంటే వద్దు
- కార్మికులకు రేవంత్ వినతి
- హైదరాబాద్ ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండి
- ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని
- దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది
- ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి

హైదరాబాద్ ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండి అని కోరారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది అన్నారు. రవీంద్ర భారతిలో నేడు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, - మిగతా 2 లో

# ఇంకా భారత్‌లోనే పహల్గాం ఉగ్రవాదులు!




- దక్షిణ కశ్మీర్ అడవుల్లో దాక్కున్న ముష్కరులు!!
- దాడికి పాల్పడిన ఉగ్రవాదులు దేశం విడిచి పారిపోలేదన్న ఎన్ఐఏ
- జమ్మూ కశ్మీర్‌లోనే దాక్కొని ఉన్నట్లు ఎన్ఐఏ అనుమానం
- మరింత మంది ఉగ్రవాదులు దాక్కొని ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం
- పర్యటకులపై దాడి చేసిన వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా భద్రతాదళాల గుర్తించాయి

## ఉద్యోగం కాదు

# ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



- యువతకు చంద్రబాబు పిలుపు
- భవన నిర్మాణ కార్మికుల పనుల కోసం భవన అనుమతులు తేలికగా పొందే వీలు
- కూటమి అధికారంలోకి వచ్చాక ఇసుక ఉచితం చేశాం
- భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే

ఏపీలో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరు జిల్లాలో నారంపేట పార్కు వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయన్నారు. 50 ఎంఎస్ఎంఈ పార్కులను ఇక్కడి నుంచే ప్రారంభించామని.. మండలానికో ఎంఎస్ఎంఈ పార్కు తీసుకురావాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నారని తెలిపారు.నెల్లూరు జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారు. వర్చువల్‌గా 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం మొదలుపెట్టారు. 14 ఎఫ్ఎఫ్‌సీలు, 25 ఎంఎస్ఎంఈ పార్కులకు - మిగతా 2 లో

## ఒక పని తలపెడితే

# మధ్యలో వదిలిపెట్టను

- నాది.. ఉడుంపట్టు..
- గతంలో దీనివల్ల మంచి ఫలితాలు వచ్చాయి
- పేదల సంక్షేమం కోసం పీ4 అమలుచేస్తున్నా
- ఏపీ సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు
- 11 ఎంఎస్ఎంఈ పార్కులు వర్చువల్‌గా ప్రారంభం



'నాది ఉడుం పట్టు.. ఒకసారి తలపెడితే మధ్యలో వదిలిపెట్టను. దీనివల్ల గతంలో మంచి ఫలితాలు వచ్చాయి' అని ఏపీ సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నారంపేటలో 11 ఎంఎస్ఎంఈ పార్కులను ఇవాళ ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంపద సృష్టిస్తాం.. అభివృద్ధి చేస్తాం, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అభివృద్ధి సంపద సృష్టిస్తుంది.. ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. ఎన్నికల ముందు తాము హామీ ఇచ్చినట్లుగా 20 లక్షల మందికి ఉపాధి హామీ కల్పనకు కట్టుబడి ఉన్నామన్నారు. పేదల సంక్షేమం కోసం పీ4 అమలుచేస్తున్నట్లు వివరించారు.

- మిగతా 2 లో

## నేడు రాష్ట్రంలో

# ప్రధాని మోడీ పర్యటన



- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి
- మొత్తం రూ.57,962 కోట్ల పనులకు భారత ప్రధాని మోడీ శంకుస్థాపన
- వేదికపై ప్రధాని మోడీతో పాటు కేవలం 14 మంది మాత్రమే కూర్చునేందుకు అనుమతి

భారత ప్రధాని నరేంద్ర మోడీ మే 2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రధాని తన పర్యటనలో భాగంగా రేపు రాజధానిలో రూ.49,040 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో రాష్ట్ర హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాల తో పాటు.. న్యాయమూర్తుల నివాస

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి




- నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం హాజరకానున్నారు
- సమావేశంలో రాహుల్ గాంధీ,సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరకానున్నారు
- కులగణనపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ

## మొదటిపేజీ తరువాయి

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి



సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు సాయంత్రం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. దీనికి హాజరయ్యేందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి ఉదయం ఢిల్లీకి పయనం కానున్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ నాయకులతో పాటు, అన్ని రాష్ట్రాల ముఖ్య కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణనపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్టు సమాచారం.

# ఆర్టీసీ లో సమ్మె వద్దంటే వద్దు



గత పదేళ్లలో విధ్వంసం జరిగిందని,.. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి.. ఏదైనా సమస్య ఉంటే మంత్రిగారితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అన్నారు. అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఇక, కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది అని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు.

**కెసిఆర్ అప్పుల్లో ముంచి వెళ్లారు..**

తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8.15 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆ డబ్బంతా ఎక్కడకి పోయిందో కూడా తెలియడం లేదని రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే తమ ప్రభుత్వం కొత్తగా రూ.1.58 లక్షల కోట్లు రుణం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా విచ్చలవిడిగా అప్పులు చేసిందని ఆరోపించారు.సుమారు లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయిందని, ఇది గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందిస్తున్నామని, తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8.15 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా ఎలా మారిందని ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానా దివాలా తీస్తే, కేసీఆర్ కుటుంబానికి మాత్రం ఫామ్‌హౌస్‌లు, మీడియా సంస్థలు ఎలా సమకూరాయని ఆయన నిలదీశారు. నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కు కూడా లేకుండా ధర్నా చౌక్‌ను మూసివేయడాన్ని ఆయన తప్పుపట్టారు.ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉందని వివరించారు. ప్రభుత్వానికి ప్రతినెలా సుమారు రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తుంటే, అందులో రూ.6 వేల కోట్లు గత ప్రభుత్వ అప్పుల కిస్తీలకు, మరో రూ.6 వేల కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని తెలిపారు. రాష్ట్ర కనీస అవసరాలు తీరాలంటే నెలకు రూ.22 వేల కోట్లు అవసరమని, ఇలాంటి పరిస్థితుల్లో కొత్త డిమాండ్లు రావడం సరికాదని అన్నారు.సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బకాయిలు కూడా గత ప్రభుత్వమే మిగిల్చిందని, ఆర్థిక వనరులు లేకున్నా అడ్డగోలుగా అప్పులు తెచ్చారని ఆరోపించారు. యువతకు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.తమ ప్రభుత్వం కూలిపోవాలని మాజీ సీఎం కేసీఆర్ రోజూ శాపనార్థాలు పెడుతున్నారని, అయితే పిల్లి శాపాలకు ఉట్టి తెగిపడదన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని రేవంత్ రెడ్డి హితవు పలికారు. కేసీఆర్‌ను 'కపట నాటక సూత్రధారి'గా అభివర్ణించిన సీఎం, ప్రజలు ఆయన మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుందామని ఆయన పేర్కొన్నారు.

# రేపు ఏం జరగబోతుందో తెలియదు.. ఇరుదేశాలు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి


**పహల్గామ్ ఉగ్రదాడిపై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా స్పందన**

**భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం వచ్చే అవకాశం ఉందని హెచ్చరిక**

**పాకిస్థాన్ తీరును, ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన ఫరూక్**

**కశ్మీర్‌లో భద్రతా, నిఘా వైఫల్యాలను ఎత్తిచూపిన వైనం**

**యుద్ధం నివారించాలంటే దోషులను పట్టుకోవాలని సూచన**




జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటన దాయాది దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన వేళ, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు, సీనియర్ నేత ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం సంభవించే ప్రమాదం లేకపోలేదని ఆయన హెచ్చరించారు. ఉగ్రవాదుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు.మీడియాతో మాట్లాడిన ఫరూక్ అబ్దుల్లా, పహల్గామ్ దాడి అనంతరం నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. "రేపు ఏమి జరగబోతుందో ఎవరికీ తెలియదు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇరు దేశాలు యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది" అని అన్నారు. ఈ ప్రాంతంలో అస్థిరతను సృష్టించేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.అదే సమయంలో, కశ్మీర్‌లో భద్రతా లోపాలు ఉన్నాయనే విషయాన్ని కూడా ఫరూక్ అబ్దుల్లా ప్రస్తావించారు. "పహల్గామ్ దాడి జరగడానికి భద్రతా, నిఘా వైఫల్యాలు కూడా కారణమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని నివారించాలంటే, ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను, దాని వెనుక ఉన్న శక్తులను వీలైనంత త్వరగా గుర్తించి, పట్టుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. యుద్ధ నివారణకు ప్రయత్నాలు జరగాలని ఆకాంక్షించారు.

# ఒక పని తలపెడితే మధ్యలో వదిలిపెట్టను

మొదటిపేజీ తరువాయి

**భవిష్యత్ ఏఐదే..**

భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని చంద్రబాబు చెప్పారు. ఏఐని ఉపయోగించుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని సూచించారు. రైతులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. రైతుల పరిశ్రమలకు అవసరమైన అనుమతులు ఇస్తామని తెలిపారు. 100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్, 100 ఎకరాలకు పైగా ఉంటే మేజర్ పార్కులు ఏర్పాటు చేయవచ్చన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 5,000 కోట్లతో ఎల్జీ సంస్థ 10వేల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎమ్ఎస్ఎమ్ఈ పార్కులు, అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

**90శాతం పింఛన్ల పంపిణీ**

ఏపీలో ఇవాళ మధ్యాహ్నం 2 గంటల వరకు 90.86 శాతం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో మొదటి స్థానంలో విజయనగరం జిల్లా నిలిచింది. చివరి స్థానంలో 87 శాతంతో పల్నాడు జిల్లా ఉంది. ఇవాళ ఉదయం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం నెల్లూరుపాలెం గ్రామం ఎస్టీ కాలనీలో సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. చలంచర్ల సుస్మితకు వితంతు పింఛన్‌ను అందించారు. టీటీసీ చదివిన సుస్మితకు డీఎస్సీలో ఉద్యోగం కోసం ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. సుస్మిత ఐదేళ్ల కుమార్తె చైత్రికను గురుకుల పాఠశాలలో చేర్పించి



చదువు చెప్పిస్తామని హామీ ఇచ్చారు. మరో మహిళ అంకోజి సుమ తన కుమారుడికి ఉపాధి మార్గం చూపించాలని విన్నవించగా వ్యవసాయ శాఖ నుంచి డ్రోన్ అందించి శిక్షణ ఇచ్చి ఉపాధి చూపిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కాలనీ వాసుల నుంచి పలు అర్జీలను సీఎం స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. మరోవైపు ఏపీలోని పలు చోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పింఛన్లు అందజేశారు.

# నేడు రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటన

మొదటిపేజీ తరువాయి

సముదాయాలకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల గృహ సముదాయాలకు రైల్వే లకు సంబంధించిన.. రూ.8 వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటుగా.. నాగాయలంకలో రూ.1,500 కోట్లతో నిర్మించనున్న..మిసైల్ టెస్ట్ రేంజ్‌కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు రక్షణ శాఖ అధికారులు పాల్గొంటారు.వీటితో పాటుగా విశాఖలో యూనిటీ మాల్‌కు శంకుస్థాపన, రూ.293 కోట్లతో గుంతకల్లు రైల్వే ప్రాజెక్ట్‌తో పాటుగా.. నేషనల్‌హైవే ప్రాజెక్ట్‌లకు కలిపి మొత్తం రూ.57,962 కోట్ల పనులకు భారత ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లోని ఎన్డీయే ప్రభుత్వం లోని కీలక మంత్రులు, నేతలు పాల్గొంటారు. అయితే ప్రధాని మోడీ రోడ్ షో, పబ్లిక్ మీటింగ్ లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మీటింగ్ కోసం బీజేపీ నేతలు ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై ప్రధాని మోడీతో పాటు కేవలం 14 మంది మాత్రమే కూర్చునేందుకు అనుమతి ఇవ్వనున్నారు. రాష్ట్రంలో ప్రధాని పర్యటన కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలతో పాటు, పలు



ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

# ఇంకా భారత్‌లోనే పహల్గాం ఉగ్రవాదులు!

మొదటిపేజీ తరువాయి



పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రత బలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. వీరి జాడ కోసం జల్లెడ పట్టి అణువణువు శోధిస్తున్నాయి. అయితే, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఇంకా దేశం విడిచి పారిపోలేదని జాతీయ పరిశోధన సంస్థ వెల్లడించింది. వీరంతా జమ్ము కశ్మీర్‌లోనే దాక్కొని ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దక్షిణ కశ్మీర్‌లోని అటవీ ప్రాంతాల్లో ముష్కరులు తలదాచు కుంటున్నట్లు తెలిపింది. పర్యాటకులపై దాడి చేసిన అనంతరం వీరంతా అటవీ ప్రాంతంలోకి వెళ్లి దాక్కున్నట్లు బలమైన ఆధారాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. ఆహారం, ఇతర అవసరమైన సామగ్రి ముష్కరుల వద్ద ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అంతేకాదు ఆ ప్రాంతాల్లో మరింత మంది ఉగ్రవాదులు దాక్కొని ఉన్నట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని అధికారులు తెలిపారు.మరోవైపు పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రసంస్థే 2024లో గాందర్‌బల్ జిల్లాలో సొరంగంలో దాడికి పాల్పడినట్లు నిఘా వర్గాలు నిర్ధరించాయి. లష్కరే తోయిబా ఉగ్రసంస్థ మద్దతున్న ఈ ఉగ్రవాద విభాగం ఈ రెండు దాడులు చేసినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఆ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులే తాజాగా పహల్గాం దాడిలో పాల్గొన్నట్లు పేర్కొన్నాయి. పహల్గాం దాడిలో ప్రమేయం ఉన్న లష్కరే ఉగ్రవాది హాషీం ముసా అలియాస్ సులేమాన్ అప్పటి దాడిలో పాల్గొన్నట్లు నిఘా వర్గాలు నిర్ధరించాయి.గతేడాది గాందర్‌బల్ జిల్లా సోనామార్గ్‌లోని జెడ్ మోర్ సొరంగం ప్రాజెక్టు వద్ద ఉగ్రదాడి జరిగింది. ప్రైవేట్ నిర్మాణ సంస్థ నిర్వహిస్తున్న కార్మికుల శిబిరంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఆ దాడిలో ఓ వైద్యుడు సహా ఆరుగురు కార్మికులు మృతి చెందారు. నాటి దాడిలో పాల్గొన్న ఉగ్రవాది జునైద్ అహ్మద్ భట్‌ను గతేడాది డిసెంబర్‌లో భద్రత బలగాలు మట్టుబెట్టాయి. తర్వాత ఆ గ్రూపునకు చెందిన మరో ఇద్దరు ఉగ్రవాదులను కూడా హతమార్చినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. అయితే, పర్యటకులపై దాడి చేసిన వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించాయి భద్రతాదళాలు. వీరికి మూసా, యూనిస్, ఆసిఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ ముగ్గురి ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేశారు.

# ఉద్యోగం కాదు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

మొదటిపేజీ తరువాయి

సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏపీలో అసంఘటిత కార్మికులు అధికంగా ఉన్నారని అందులోనూ వ్యవసాయం మీద అత్యధికంగా ఆధారపడ్డారన్నారు. ఇప్పుడే భవన నిర్మాణ కార్మికుల బాధలు చూశానని మిట్టమధ్యాహ్నం వేళ కాలే ఇనుప కమ్మిలతో పనిచేస్తున్నారని.. వారందర్నీ ఆదుకోవడం మనందరి బాధ్యత అని చెప్పుకొచ్చారు. టీడీపీ సింబల్‌లో పేదలకు గుర్తుగా ఇళ్లు, రైతులకు గుర్తుగా నాగలి, కార్మికులకు గుర్తుగా చక్రం ఉంటుందని.. ఆ చక్రం దేశంలోని ఏ పార్టీ సింబల్‌లో ఉండదన్నారు.

**వారిని కోటీశ్వరులను చేయాలనుకున్నాం**

గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేశారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇసుక ఉచితం చేశామని భవన నిర్మాణ కార్మికుల పనుల కోసం భవన అనుమతులు తేలికగా పొందే వీలు కల్పించామన్నారు. నారంపేట ఎంఎస్ఎంఈ పార్కులో నేరుగా పరిశ్రమ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. షెడ్లు, కరెంటు అందుబాటులో ఉంటాయని. కామన్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. 34వేల ఎకరాల్లో అమరావతిని నిర్మించి అక్కడి వారిని కోటీశ్వరులని చేయాలనుకున్నామన్నారు. 29 వేల మంది రైతులు భూములిచ్చారని.. ఎక్కడా రైతుకి అన్యాయం జరగకుండా చూసిన పార్టీ టీడీపీ అని వెల్లడించారు. కొందరికి అభివృద్ధి జరగకూడదని పుల్లలు పెడుతుంటారని మండిపడ్డారు.భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే అని చెప్పుకొచ్చారు. వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతరం కేంద్రంగా అయిదు రీజనల్ హబ్‌లు పెడుతున్నామన్నారు. పరిశ్రమలను విద్యాసంస్థలను అనుసంధానం చేయబోతున్నామన్నారు. యువత అందరికీ మంచి ఆలోచనలు ఉన్నాయన్నారు. ఉద్యోగం పొందడం కాదని, ఉద్యోగాలిచ్చే స్థాయిలో ఉండాలని సూచించారు. ఐటీ వల్ల ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మన తెలుగు బిడ్డలు ఉన్నారని ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

**ఆ బాధ్యత ఆనం దే**

పరిశ్రమలకు లోన్లు, అనుమతులు వంటివి సింగిల్ విండో ద్వారా త్వరగా ఇస్తామన్నారు. ప్లగ్ అండ్ ప్లే ఎంఎస్ఎంఈలో అన్ని సిద్ధంగా ఉంటాయన్నారు. యంత్రాలు తెచ్చుకుంటే చాలన్నారు. ఫ్లడెడ్ ఫ్యాక్టరీ ప్రారంభించడం ఆనందదాయకంగా ఉందన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలను సూచించారు.ఇక్కడ ఎంఎస్ఎంఈలో పరిశ్రమలు ఏర్పాటు చేయించే బాధ్యత ఆనం రామనారాయణరెడ్డిదే అని అన్నారు. రైతులను పారిశ్రామికవేత్తలని చేయాలని.. భూమి మీద అని.. మీరూ



నానో పార్కులు తీసుకుని పరిశ్రమలు పెట్టాలని కోరారు. ఆడబిడ్డలు బాగా చదువుకున్నారని మీరు కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ఇంకా పరిశ్రమలు వస్తాయ్**

ప్రపంచంలో ఎక్కడకి వెళ్లినా కూడా నా రాజధాని అమరావతి అని చెప్పుకోవాలన్నారు. దగదర్తిలో త్వరలోనే ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేస్తామన్నారు. పోర్టులు, రైల్వే లైన్లు, నేషనల్ రోడ్లు, పరిశ్రమలు వస్తుంటే ఇంకేమి కావాలన్నారు. ఇప్పటికే చాలా పరిశ్రమలు వచ్చాయని ఇంకా పరిశ్రమలు వస్తాయన్నారు. సోమశిల నీరు ఆత్మకూరుకి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిది అని స్పష్టం చేశారు. శ్రీశైలం నీటిని నెల్లూరుకు ఇచ్చిన తరువాతే తమిళనాడుకు వెళ్లాలని ఎన్టీఆర్ పట్టుబట్టారన్నారు. అందుకే సోమశిలకి నీరొస్తుందన్నారు. కండలేరు కూడా ఆయనే నిర్మించారని తెలిపారు. ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. సంపద సృష్టిస్తేనే అభివృద్ధి జరుగుతందన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు ఇస్తున్నామన్నారు. మొదట పించన్లు ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. దివ్యాంగులపై అత్యంత ప్రేమ చూపిన పార్టీ టీడీపీ, ఎన్డీఏ అని చెప్పుకొచ్చారు. ఒక ప్రాంతంలో వంద మంది ఉంటే, బాగా పేదరికంలో ఉన్నవారి బాధ్యతను ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఇరవై మంది అన్నీ చూసుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# కులగణనలో తెలంగాణ మోడల్ తీసుకోవాలి

కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీలో కేంద్ర మంత్రులు, సీనియర్ అధికారులను నియమించాలి."రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చేశాం : తెలంగాణలో చేపట్టిన 8 పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా వివరాలు సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కులగణన విషయంలో తెలంగాణ అనుభవం కేంద్రానికి ఉపయోగ పడుతుందన్నారు. ఎన్యుమరేటర్ నుంచి సీఎస్ వరకు పలుసార్లు సమీక్ష చేసినట్లు వివరించారు. కులగణన విషయంలో అనేక సూచనలు, సలహాలు వచ్చాయన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ ఇచ్చామన్న ఆయన, ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కులగణన చేపట్టామని గుర్తు చేశారు."జనగణనలో కులగణన చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. రాహుల్ హామీ మేరకు రాష్ట్ర ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. ప్రజాసంఘాల ప్రతినిధులను సంప్రదించి ప్రశ్నపత్రం తయారు



చేశాం. రాష్ట్రంలోని బలహీనవర్గాల తరపున రాహుల్‌కు కృతజ్ఞతలు చెబుతున్నాం. కులగణనకు ఉత్తమ్, భట్టి, సీతక్క, పొన్నం, శ్రీధర్‌బాబుతో కమిటీ వేశాం. కులగణన, బీసీలకు 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇవ్వాలని కోరాం. ఈ అంశాలపై అసెంబ్లీలో రెండు తీర్మానాలు చేశాం. ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పుడు పూర్తి చేస్తారో తేదీలు నిర్ణయించాలి. కులగణన చేసేముందు వచ్చే సవాళ్లపై అన్ని రాష్ట్రాలతో మాట్లాడాలి. పార్టీలు, ప్రజాసంఘాలతో నిపుణుల కమిటీ విస్తృతంగా చర్చించాలి. కులగణనపై విధివిధానాలు పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి."ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కులగణనలో అన్ని పార్టీలనూ భాగస్వాములు చేశామన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి రోల్ మోడల్ అని రాహుల్ చెప్పారు. కులగణన విషయంలో తమ అనుభవాన్ని కేంద్రంతో పంచుకుంటామని తెలిపారు. నివేదిక తయారు చేశాక పేదలకు లబ్ధి జరగాలని ఆశించారు. ఆలస్యమైనా కేంద్రం మంచి నిర్ణయం తీసుకుందన్న ఆయన, దాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బలహీనవర్గాలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు. కులగణన విషయంలో కేంద్రంపై విమర్శలు చేయడం తనకు ఇష్టం లేదన్నారు.

# పేదరికం రూపుమాపేందుకు విద్య ఒకటే మార్గం

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కలెక్టర్...**

**విద్యకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తా.**





**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ మే 1 :** పేదరికం రూపుమాపేందుకు విద్య ఒకటే మార్గం అని కలెక్టర్ హనుమంతరావు ఉద్బోధించారు.గురువారం కలెక్టరేట్ లో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ,జిల్లాలోని మండలాల కళాశాల ప్రిన్సిపల్ ప్రిన్స్ పాళ్ళతో కలెక్టర్ హనుమంతరావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రతి విద్యార్థి ఏదో ఒక దశలో తనపై నమ్మకం పెంచుకుంటాడని భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకుంటాడనే నమ్మకం ఉండాలి అని వివరించారు.ఒక్కొక్క విద్యార్థి ఒక్కో కుటుంబం అని మర్చిపోవద్దు,అందరూ ఉత్తీర్ణత తో 100శాతం ఫలితాలు సాధించి ఉన్నత చదువు చదవాలన్నదే తన ఆకాంక్ష గా తెలిపారు.అనుకున్న ప్రకారం గా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన 5 మందికి సైకిళ్ల పంపిణీ చేశారు.వచ్చే ఏడాది ప్రతి కళాశాలలో నూటికి నూరు శాతం ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధిస్తే 50 సైకిళ్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.ఫలితాలు మెరుగుపరచాలన్నదే ప్రభుత్వ ధ్యేయం.రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ లో 98.09శాతం సాధించిన ధీరజ్ కుమార్ , అదే కళాశాలలో ఇంటర్ సి.ఈ.సి లో 91.60శాతం శ్రేష్ఠ , ఒకేషనల్ కోర్స్ లో ఎం ఎల్ టి లో 98.80శాతం సాధించిన నందిని , వలిగొండ ఎస్ .వి. ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ బైపిసి లో 96.59శాతం సాధ్వించిన గంజి సరస్వతి , యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ హెచ్. ఈ సి లో 93.40శాతం సాధించిన అభిలాష లను వారి తల్లిదండ్రులు తో సహా శాలువాలు కప్పి మెమెంటో లను అందించి కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజాభివృద్ధికి విద్య ఎంతగానో దోహదం చేస్తుందని, అందుకు ప్రతి ఒక్కరూ చదువుకునేలా ప్రోత్సహిస్తానని ఆత్మవిశ్వాసం కల్పించి ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తానని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుకు గట్టి పునాది వేస్తానని, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుతానన్నారు.ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థి కి మార్గదర్శకులు కావాలన్నారు. ప్రభుత్వ విద్య పట్ల విద్యార్థుల్లో నమ్మకం కలిగేలా అంకితభావంతో పని చేయాలన్నారు వారిలో మానసిక ధైర్యాన్ని కల్పిస్తూ విద్య పట్ల ఇష్టత కల్పించాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరిని ప్రభుత్వ కళాశాలలో చేరే విధంగా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫ్లెక్సీ, పాంప్లెట్ల ద్వారా అత్యధిక మార్కులు సాధించిన వారి వివరాలను పొందుపరిచి విస్తృత ప్రచారం చేపట్టి ప్రభుత్వ కళాశాలలో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మండలాల వారీగా సంబంధిత ప్రిన్సిపల్స్ కళాశాలల వారీగా వచ్చిన శాతమే కాకుండా కళాశాలలో చదివిన వారందరూ ఉత్తీర్ణులవ్వాలని ఉన్నత విద్య అభ్యసించేలా కృషి చేయాలన్నారు.మొదటి ,రెండు సంవత్సరాలలో ఫెయిల్ అయిన విద్యార్థుల పైన ఎక్కువ శ్రద్ధ పెట్టి వారిని చదివించి సప్లమెంటరీ పరీక్షలలో అందరూ పాసై డిగ్రీలో చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డి ఆర్ డి ఓ నాగిరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, ఎస్సీ షెడ్యూల్ కులాల శాఖ అభివృద్ధి అధికారి వసంతకుమారి, ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ,తదితరులు పాల్గొన్నారు.

# బ్రిటిష్ వారి కంటే ఎక్కువ శ్రమ దోపిడీ చేస్తున్న బిజెపి

**మే డే అమర వీరుల స్ఫూర్తి తో ఉద్యమించాలి**

**సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పండు**




**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, మే 1 :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ ,బ్రిటిష్ వారి కంటే ఎక్కువ పని చేయించుకుంటూ, శ్రమ దోపిడీ చేస్తున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దాసరి పండు ఆరోపించారు. గురువారం 139 వ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో, పట్టణం, మండలం లో ఉన్న హమాలీ, మున్సిపల్, భవన నిర్మాణ, గ్రామ పంచాయతీ తదితర రంగాల మేడే జెండాలను ఆవిష్కరించారు.మేడే అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సందర్భంగా పాండు మాట్లాడుతూ, కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను కార్పోరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చట్టసభలలో అనేక రకాలైన బిల్లును తీసుకువస్తూ 44 కార్మిక చట్టాలను , నాలుగు కోడ్ లుగా చేసి సామాజిక భద్రత అయిన ఈఎస్ఐ, పిఎఫ్ మహిళలకు రక్షణ సౌకర్యాలు లాంటివి అమలు చేయకుండా అన్యాయాలకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. జూనియర్ కళాశాల మైదానంలో సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అమెరికా దేశంలో చికాగో నగరంలో మార్కెట్ పెట్టు బడుదారులు కార్మికులతో 12 గంటలు పని చేయించుకుంటూ ఎలాంటి కార్మిక చట్టాలను అమలు చేయకుండా ,శ్రమదోపిడి చేస్తున్న రోజులలో కార్మిక వర్గం కుల మతం ప్రాంతం ,ఆడ మగ అనే తేడా లేకుండా ,ఐక్యంగా పోరాటం చేసి ఎనిమిది గంటల పని దినం కావాలని కార్మిక చట్టాలు కావాలని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న సందర్భంగా అమెరికా సామ్రాజ్యవాదం పోలీసు లతో కాల్పులు జరిపి అనేకమంది కార్మికులను చంపడం జరిగిందని తెలిపారు. చాలా మంది శత గాత్రులు అయ్యారని,ఆ పోరాట ఫలితమే ఏర్పడిన రోజు మేడే అని కార్మికులు దిక్సూచి గా తీసుకోవాలని ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన కార్మికుల బతుకులలో మార్పు రాలేదని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలు కార్మిక చట్టాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకివచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాల అవలంబించే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం మేడే అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు రామకుమారి, సిఐటియు పట్టణ కన్వీనర్ గంధ మల్ల మాతయ్య, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు సత్తయ్య, వెంకటేశం ,రామకృష్ణారెడ్డి, భవన నిర్మాణ కార్మిక యూనియన్ నాయకులు ప్రసాదు ,ఎల్లమ్మ ,లక్ష్మమ్మ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజయ్య ,రవి, వరమ్మ ,శాంతమ్మ లక్ష్మీ ,రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పాలిట యముడు

**ఎదురు చెప్పితే కష్టాలు కొనితెచ్చుకున్నట్టే**

**ఆయన ఒక మోనార్క్ మాట వేదం ,చేసింది ఆమోదం**

**ఆదాయానికి మించిన ఆస్తులు తో అరెస్ట్ , 14 రోజుల పాటు రిమాండ్ లో ఉన్న కాలేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ హరిరామ్**



**హైదరాబాద్ ,తెలంగాణ సేన న్యూస్ , మే 1 :** ఆదాయానికి మించిన ఆస్తులతో, అరెస్టు అయిన కాలేశ్వరం ఎత్తిపోతల పథకం, గజ్వేల్ ఈఎన్సీ హరి రామ్, తన కిందిస్థాయి ఉద్యోగుల పట్ల యముడు గా వ్యవహరించేవాడని తెలుస్తుంది .ఉద్యోగులు ఎవరైనా ఎదురు చెపితే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని,

ఆయన ఒక మోనార్క్, మాటే వేదం, చేసిందే ఆమోదం, అన్నట్లుగా ఉద్యోగులలో పేరు ఉంది. విశ్వాసనీయ సమాచారం మేరకు తన పరిధిలోని సిబ్బందిని హరి గోస పెట్టే వాడని, ముఖ్యంగా మాజీ సీఎం కు నమ్మిన బంటు గా పేరుంది. కాళేశ్వరం యూనిట్ పనిచేసే ఉద్యోగులు తమ సమస్యల గురించి చెప్పు కోవడని నెలల తరబడి చెప్పులు అరిగేలా తిరిగి నప్పటికీ, కనికరించేవాడు కాదు అంటున్నారు. తమ గోడు వెళ్ళబోసుకోవడానికి తిరిగి క్రమంలో, ఎట్టకేలకు ఆయన దర్శనం కలిగితే , ఎందుకు వచ్చావ్ ? అంటూ నీ పై అధికారుల అనుమతి తీసుకున్నావా ! అని అరా తీసి ,ఇంకోసారి పెర్మిషన్ ఇస్తే నిన్ను, తన ను సస్పెండ్ చేస్తానంటూ హుకుం జారీ చేసేవాడు అని తెలుస్తుంది. కింది స్థాయి అధికారులను బెదిరింపులకు గురి చేయడంతో, ఉద్యోగులు తమ సమస్యను ఎవరికి చెప్పు కోవాలో అర్థం కాక అయోమయం తో , పది సంవత్సరాలుగా ఒకే చోట పడి ఉన్న ఎందరో ఉద్యోగులు డిపార్ట్ మెంట్ లో కో కొల్లలు. అప్పట్లో మాజీ సీఎం కేసీఆర్ వీఆర్వో,వీఆర్ఏ ,వ్యవస్థలను రద్దు చేసి మిగతా డిపార్ట్ మెంట్ల శాఖలలో బదలాయింపు సర్దు బాటు చేసే క్రమంలో,ఏ డిపార్ట్ మెంట్లలో లేని విధంగా కేసీఆర్ మెప్పు కోసం సర్ ప్లస్ ఉద్యోగులుగా పెద్ద మొత్తం తీసుకోవడం గమనార్హం. ప్రధానమైన అంశములలో భాగంగా, భారీ నీటిపారుదల శాఖ, రాష్ట్రంలోని మొత్తం ఇతర యూనిట్ లలో ,తమ కిందిస్థాయి ఉద్యోగుల కు ప్రమోషన్ లు ఇచ్చి, మిగతా ఖాళీగా ఉన్న సీట్లను సర్దు బాటు చేస్తే ,హరిరామ్ మాత్రం డిపార్ట్ మెంటు లో ఎవ్వరికి పదోన్నతులు కల్పించకుండా , కాలయాపన చేసిన ఘనత ఈయన కే దక్కుతుంది అంటున్నారు.మా పాపం మా పిల్లల ఉసురు ఊరికే పోదని అంటూ శాపనార్థాలు కురిపిస్తూ, లోలోపల మదన పడిపోతున్నారు.గజ్వేల్ యూనిట్ లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఈఎన్సీ అండ దండలతో తోటి ఉద్యోగుల పై పెత్తనం చెలాయిస్తూ, దురుసుగా ప్రవర్తనతో ఈఎన్సి అధికారి చెప్పు చేతుల్లో పని కావాలంటే పైసా ఇవ్వనిది ఫైలు కదలదు అంటున్నారు. గజ్వేల్ లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి ఈఎన్సీ కే రెండవ బాస్ గా చెలామణి అవుతూ పది సంవత్సరాలుగా అదే సీట్ లో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న తనకు మాత్రం బదిలీలు లేకపోవడం తీరు పై అనుమానాలకు తావిస్తుంది. తనకి కూడా హరిరామ బినామీ ఆస్తుల్లో పాత్ర ఉందని అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఉద్యోగుల ట్రాన్స్ఫర్ లు, డిప్యూటేషన్ , ప్రమోషన్ ల విషయములో పది సంవత్సరాలు గా పెండింగులో ఉండడం పలు అనుమానాలకు తవిస్తున్నట్లు, అభిప్రాయం వినిపిస్తుంది.

## కుల గణన వ్యతిరేకించిన మోడీ నేడు కుల గణన కు నిర్ణయం తీసుకోవడం రాహుల్ గాంధీ విజయం

**కుల గణన కు రోల్ మోడల్ తెలంగాణ ,**

**కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం**

**తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్**

**నూతి శ్రీకాంత్ గౌడ్**




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ ,మే 1 :** నాడు వ్యతిరేకించిన మోడీ నేడు కుల గణన కు నిర్ణయం తీసుకోవడం రాహుల్ గాంధీ విజయమని తెలంగాణ బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ వెల్లడించారు గురువారం పత్రికలకు విడుదల చేస్తున్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దేశ జనాభా లెక్కలతో పాటు కుల గణన కు,కేంద్ర క్యాబినెట్ లో నిర్ణయం తీసుకోవడం పట్ల, తెలంగాణ రోల్ మోడల్ గా మారింది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆచరణను , కేంద్రం అనుసరించడం ,కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీకి క్రెడిట్ దక్కుతుందని అభిప్రాయపడ్డారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేసి తీరుతామని చెప్పిన మాటకు కట్టుబడి రాహుల్ గాంధీ ఉన్నట్లు వివరించారు.భారత్ జోడో పాద యాత్ర ద్వారా కన్యాకుమారి మంచి కాశ్మీర్ వరకు చేపట్టి , ఎందుకు చేయాలి, అనే దానిపై ప్రజలలో కి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.రాహుల్ స్పూర్తితో నే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కుల గణన చేసి దేశానికి ఆదర్శంగా నిలవడం గర్వకారణం అన్నారు.కర్ణాటక రాష్ట్రంలో సైతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ,సీఎం సిద్ద రామయ్య నేతృత్వంలో చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో, కుల గణన లోప భూయిష్టంగా ఉందని ,కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం అన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుల గణన చెయ్యాలనే నిర్ణయించడం అభినందనీయం అన్నారు.రాహుల్ గాంధీ ఎత్తుకున్న కుల గణన అంశం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడంతో ,కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి కుల గణన చేస్తామని ప్రకటించిందని తెలిపారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో వ్యతిరేకంగా మాట్లాడిన మోడీ ఇప్పుడు నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ విజయం భావిస్తున్నట్లు ప్రకటించారు.. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దశాబ్ద కాలంగా కుల గణన రిజర్వేషన్ల అమలును విస్మరించిందని కాంగ్రెస్ అగ్రనేతల డిమాండ్ తో ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల రాహుల్ ఆలోచనలను దేశ ప్రజలు మద్దతుగా ఉన్నారు, అనడానికి నిర్ణయం అద్దం పడుతుందన్నారు శ్రీకాంత్ గౌడ్ వివరించారు.

## చట్టాలు రూపొందించి కార్మికుల జీవితాల లో వెలుగులు నింపింది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

**ఐ ఎన్ టి యు సి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోని జెండాను ఆవిష్కరించిన**

**పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్**



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, మే 1 :** కార్మికుల జీవితాలలో వెలుగులు నింపేందుకు , రాజ్యాంగంలో అంబేద్కర్ అనేక చట్టాలు రూపొందించారని ,పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా, ఐ ఎన్ టి యు సి మున్సిపల్ వర్కర్స్ జెండాను డంపింగ్ యార్డ్ వద్ద ఆవిష్కరించారు.యూనియన్ గౌరవ అధ్యక్షులు పడిగెల ప్రదీప్ ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రమోద్ కుమార్ తో పాటు ,మాజీ మున్సిపల్ చైర్మన్ జహంగీర్ లు హాజరయ్యారు . ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే కార్మిక దినోత్సవం మే డే వెనకాల ఎందరో కార్మికుల ప్రాణ త్యాగాలు ఉన్నట్లు తెలిపారు.రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ కృషి మేరకు, కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం ,లింగ బేధం లేకుండా సమాన పనికి సమాన వేతనం అమలు లోనికి వచ్చిందన్నారు. కార్మికులకు పరిహార , రక్షణ చట్టాలు,స్త్రీలకు ప్రసూతి ప్రయోజనాల గురించి ఎనలేని కృషి చేశారని సందర్భంగా వివరించారు. మున్సిపాలిటీకి జనరల్ ఫండ్ లేకపోవడం వల్ల కార్మికుల కు సకాలంలో జీతాలు చెల్లించక అర్ధ ఆకలితో దుర్భరమైన జీవితం వెల్ల దీసేవారని గుర్తు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ,ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఆనాటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి పారిశుద్ధ్య కార్మికుల జీతాల సమస్యలు దృష్టికి తీసుక పోవడంతో , స్పందించి 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మున్సిపల్ పారి శుద్ధ కార్మికులకు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించే విధంగా ప్రత్యేక జీవో తీసుకువచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి సీఎం వైయస్సార్ కు ఘనత దక్కుతుందని అన్నారు . భువనగిరి మున్సిపాలిటీ కార్మికుల పోరాట ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారి శుద్ధ కార్మికులకు ట్రెజరీ ద్వారా జీతాలు అందించేందుకు , మన భువనగిరి కార్మికులే కారణం కావడం విశేషం అన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు, డ్రైవర్ లు గా విధులు నిర్వహిస్తున్న వారికి సరైన జీతాలు ఇవ్వకపోవడం , ఏరియల్, పిఎఫ్ పారిశుద్ధ కార్మికులకు ప్రతి ఆరు నెలలకు అందించే సబ్బులు, దుస్తులు, నూనెలు రావడం లేదని తమ దృష్టికి వచ్చినందున వెంటనే పరిష్కరించే దిశగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తో చర్చించి పనికి సరైన జీతం చెల్లించే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.కొన్ని సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు కైరంకొండ వెంకటేష్, వడిచెర్ల కృష్ణ యాదవ్, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల బాలరాజు, పట్టణ సేవాదళ్ అధ్యక్షులు దాకురి ప్రకాష్, మున్సిపల్ జవాన్ లు గాయపాక రమేష్, గంగారం నర్సింగరావు , కాకునూరి రాములు, బర్రె శ్రీధర్, నర్సింగ్, కార్మికులు శివ వీరయ్య నరేందర్, కుమార్, ఉమేష్, శివ,రాజేష్,మల్లికార్జున్, శ్రవణ్, సురేష్, నర్సింహా,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట కోర్టు నూతన జడ్జి చండీశ్వరీ దేవి

**బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం**



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,మే 1 :** యాదగిరిగుట్ట కోర్టుకు నూతన జడ్జిగా శ్రీ చండీశ్వరి దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యవర్గం మర్యాద పూర్వకంగా జడ్జి ని కలిసి పూల మొక్క తో స్వాగతించి, శాలువా తో సన్మానం చేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు సూదగాని శ్రీహరి మాట్లాడుతూ అడ్వకేట్లు బెంచ్ అండ్ బార్ , డెకోలం , డీసెన్సిగా వ్యవహరించాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గుడ్ల స్వామి, సీనియర్ న్యాయవాది ఎం. రాజిరెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెంట రమేష్ , ప్రధాన కార్యదర్శి ఐరేని కృష్ణ , దండబోయిన గణేష్ యాదవ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బి .రేణుక ,కార్యవర్గ సభ్యులు బోందుగుల వినీత , కనకరాజు న్యాయవాదులు డప్పు వీరస్వామి , గొట్టిపాముల సాయికృష్ణ ,ఎరుకల సత్యనారాయణ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



**ముధోల్:01మే(తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ లోని కోట్ గల్లి కి చెందిన మహమ్మద్ ఆజార్ (30) అనే యువకుడు విద్యుత్ షాక్ తో బుధవారం మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు అజార్ రోజు మాదిరిగానే మోటార్ సర్వీసింగ్ దుకాణంలో కరెంట్ మెయి న్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. దీం తో స్థానికులు అంబులెన్స్ లో తరలిస్తుం డగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## శిశు మందిర్ లో ప్రారంభమైన డ్యాన్స్ క్యాంప్

**ముధోల్:01మే(తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఓం శ్రీ కళానిలయం డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ డాన్స్ క్యాంపు ను గురువారం శ్రీ సరస్వతి విద్యాపీ ఠం నిర్మల్ జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్ ప్రారంభించారు.ముందుగా పాఠశాలలో శ్రీ జ్ఞాన సరస్వతి మాత విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వ హించారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ యోగేష్ మాట్లాడుతూ ఈనెల 31 వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు డ్యాన్స్ తరగతులు నిర్వహించడం జరుగు తుందన్నారు. డాన్స్ పై ఆసక్తి గలవా రు 8978750047,9000654103 నెంబర్లకు సంప్రదించాలన్నారు.ఈ కా ర్యక్రమంలో పాఠశాల ప్రధానచార్యు లు సారథి రాజు ,ఆచార్యులు నాగేంద ర్, ప్రసన్న మాతాజీ,హితైషులు జం బుల సాయి ప్రసాద్, ప్రవీణ్,గంగారెడ్డి, తోపాటు తదితరులున్నారు.

## రబింద్రాలో విజయోత్సవ

**100 శాతం ఉత్తీర్ణత.**

**విద్యార్థులకు శుభాకాంక్షలు యాజమాన్యాన్ని అభినందించిన తల్లిదండ్రులు.**




**ముధోల్:మే 01:తెలంగాణ సేన న్యూస్ :** ముధోల్ :రబింద్ర ఉన్నత పాఠశాలలో, పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో విజయోత్సవం నిర్వహించారు. ఇటీవలే ప్రకటించిన పదవతరగతి ఫలితాల్లో రబింద్రా విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 92 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. 579 మార్కులతో బి. ఉమా మహేశ్వరి స్కూల్ టాపర్ గా నిలిచింది. 500ల మార్కులకు పైగా 72 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 50 మంది, 540పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల తరుపున సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు వచ్చి, పాఠశాలను మేనేజ్మెంటు, ఉపాధ్యాయులను ఎంతగానో పొగిడారు. తల్లి దండ్రులను కూడా సన్మానించారు. తదనంత పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్, మేనేజ్మెంట్ వారు విద్యార్థులను, ఎంతగానో పొగిడారు. ఉపాధ్యాయులను సన్మానించారు. మారుమూల ప్రాంతంలో ఇలాంటి ప్రతిభను చూపేలా అన్ని రకాల వసతులను కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామని అన్నారు.

## గజ్వేల్ లో వాలీబాల్ సమ్మర్ కోచింగ్ ప్రారంభం




**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మినీ స్టేడియంలో గురువారం గజ్వేల్ మండల వాలీబాల్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభించారు ఈ సందర్భంగా వాలీబాల్ కోచింగ్ క్యాంపు సభ్యులు మాట్లాడుతూ వేసవికాలంలో వాలీబాల్ ఉచిత కోచింగ్ క్యాంపు ప్రారంభించడం జరిగిందని ఈ అవకాశాన్ని 8 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని, వాలీబాల్ ఉచిత కోచింగ్ క్యాంపుకు సహకరిస్తున్న గాడిపల్లి అనూప్, ఎస్సార్ ఫ్లెక్సీ షాప్ అధినేత వెంకట్ గౌడ్, గుంటుకు భరత్, వాలీబాల్ కోచ్ వీరారెడ్డి, కి ధన్యవాదాలు తెలిపారు అలాగే ఈ సమ్మర్ వాలీబాల్ క్యాంపుకు ఇంకా సహకరించాల్సిన వారు గజ్వేల్ మండల వాలీబాల్ క్లబ్ సభ్యులను సంప్రదించాలని కోరారు, ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల వాలీబాల్ క్లబ్ సభ్యులు జైపాల్ రెడ్డి, సంతోష్, నవీన్, రాజు, రామ్మోహన్ రావు, జానీ, బాల సురేందర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ యంగ్ ఇండియా తరగతులు ప్రారంభం






**ముధోల్:01మే(తెలంగాణ సేన న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ఆరో తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు యంగ్ ఇం డియా సమ్మర్ క్యాంప్ తరగతులను ప్రవేశపెట్టిందని మండల విద్యాధికారి గోపిడి రమణ రెడ్డి అన్నారు. గురువా రం మండల కేంద్రమైన ముధోల్ తోపా టు మండలంలోని ఎడ్ బిడ్ ,అష్ట గ్రా మాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ శిక్ష ణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శారీరిక మానసిక అభి వృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక స మ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని చేపట్టింద న్నారు. ఈనెల 15వ వరకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యా ర్థులు సమైక్యం ద్వారా పలు రకాల శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నా రు. క్రీడలు సృజనాత్మకత అభ్యాసా లు, శారీరక అభ్యాసాలు, విద్యాభివృ ద్ధి, సాంస్కృతిక అభివృద్ధి తదితర కార్యక్రమాల పైన విద్యార్థులకు నేర్పిం చడం జరుగుతుందన్నారు. విద్యార్థ లు పాఠ్యాంశంలో కాకుండా జీవిత నైపుణ్యాలలో ముందుకు సాగేందుకు ఇదో అద్భుత అవకాశం అని అన్నా రు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు అమీర్ ఖుసురు, పిడి శ్రీనివా స్, భూమేష్, శిక్షకులు దేవోజీ శ్రీకాం త్ ,రమేష్, నీలేష్ తోపాటు తదితరులున్నారు.

## ఘనంగా మే డే దినోత్సవ వేదికలు



**ముధోల్ : మే01 తెలంగాణ సేన న్యూస్ :** మండల కేంద్రమైన కొత్త బస్టాండ్ లో అంతర్జాతీయ మే డే దినోత్సవం గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా బస్టాండ్ ఆవరణ లో సిపిఎం ఎర్రజెండాను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గంధం లింగన్న ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే చారిత్రాత్మక చైతన్య దినమని చికాగోలో ఉన్న కొంతమంది ప్రాణ త్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజన్నారు. శ్రమకు తగ్గిన పండుగ కార్మిక దినోత్సవం అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు హనుమాన్లు రవి సాయినాథ్ సాయి తో పాటు తదితరులున్నారు.

# చట్టసభలకూ పరిమితులు!

నిబద్ధత, సచ్ఛీలత, నిబంధనలపట్ల సంపూర్ణ అవగాహన కలిగినవారి సారథ్యంలో చట్టసభలుంటే అలాంటిచోట ఆరోగ్యవంతమైన చర్చలు జరుగుతాయి. ప్రజాస్వామ్యానికి ఆ సభ తలమానికమవు తుంది. కానీ అధికార పక్షానికి వంతపాడేవారు, వారి ఇష్టారాజ్యానికి పక్కతాళం వేసేవారు అధ్యక్ష స్థానాల్లో కూర్చుంటున్నారు. తాము ఎవరికీ జవాబుదారీ కాదన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అలాంటి బాపతు నేతలకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. తనను బిహార్ శాసనమండలి నుంచి బహిష్కరించటాన్ని సవాలుచేస్తూ ఆర్జేడీ సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అంగీకరిస్తూ ఆయన్ను తక్షణం సభలోకి అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సభ్యుల అనుచిత ప్రవర్తనకు తగిన శిక్ష ఉండాలితప్ప మితిమీరకూడదని తేల్చిచెప్పింది. నిరుడు మార్చిలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలోనూ, ఆ తర్వాత ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంలోనూ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై సునీల్ కుమార్ సింగ్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్నది అభియోగం. పాము కుబుసం విడిచినట్టు తరచు రాజకీయ అభిప్రాయాలు మార్చుకోవటం నితీశ్‌కు అలవాటని, ఇప్పటికి తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రి అయినా ఎమ్మెల్యేగా ప్రజలనుంచి ఎన్నిక కాలేదని సునీల్‌కుమార్ సింగ్ విమర్శించారు. అధికారమే పరమావధిగా ఒకసారి యూపీఏ, మరోసారి ఎన్డీయే కూటములతో చెలిమి చేయటాన్ని ఎద్దేవా చేస్తూ ఆయన్ను 'పాల్టూరామ్' అని హేళన చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి నివేదించారు. సునీల్ తప్పు చేశారని ఎథిక్స్ కమిటీ నిర్ధారించి సభా బహిష్కారానికి సిఫార్సుచేసింది. శాసనమండలి దీన్ని ఆమోదించి ఆయన్ను బహిష్కరిస్తూ తీర్మానించింది. మన రాజ్యాంగం కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజన చేసింది. చట్టసభలకు ప్రత్యేక హక్కులుంటాయని, వాటి కార్యకలాపాల్లో లేదా నిర్ణయాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోరాదని సభాధ్యక్షులు భావిస్తుంటారు. ముఖ్యంగా ఫిరాయింపులపై వచ్చే ఫిర్యాదుల్ని ఎటూ తేల్చకుండా వదిలేస్తూ తమను ప్రశ్నించరాదంటున్నారు. చిన్న చిన్న కారణాలకు కూడా విపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయటం, బహిష్కరణ వేటు వేయటం వంటివి రివాజయ్యాయి. కేవలం పాలకపక్ష ప్రయోజనాలను నెరవేర్చటం కోసమే స్పీకర్లు ఇలా ఇష్టాను సారం ప్రవర్తిస్తున్నారు. నిజమే... రాజ్యాంగంలోని 212(1) అధికరణ ప్రకారం చట్టసభల కార్యకలా పాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణతో ఆ కార్యకలాపాల చెల్లుబాటును న్యాయ స్థానాల్లో సవాలు చేయటానికి వీల్లేదు. నిర్వహణ సంబంధమైన అంశాల్లో న్యాయస్థానాల జోక్యంనుంచి చట్టసభలకు ఇది రక్షణనిస్తుంది. అయితే ఆ కార్యకలాపాల్లో భాగంగా తీసుకునే నిర్ణయాల్లో రాజ్యాంగ విరుద్ధత కనబడినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందన్నది నిపుణుల వాదన. తాజా కేసులో జరిగింది ఇదే. సునీల్ కుమార్ సింగ్ పిటిషన్‌కు అసలు విచార ణార్హత లేదని, 212(1) అధికరణ న్యాయవ్యవస్థ జోక్యాన్నుంచి తమకు రక్షణనిస్తున్నదని శాసన మండలి తరఫు న్యాయవాది వాదించారు. సర్వోన్నత న్యాయస్థానం దీన్ని అంగీకరించలేదు. చట్ట సభల కార్యకలాపాలు వేరు, అందులో తీసుకునే నిర్ణయాలు వేరు అని స్పష్టం చేసింది. చట్టసభల నిర్ణయాలు వ్యక్తుల ప్రాథమిక హక్కుల్ని ప్రభావితం చేసినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందని తెలిపింది. అంతేకాదు... సునీల్‌కుమార్ సింగ్‌ను బహిష్కరిస్తూ తీసు కున్న ఎథిక్స్ కమిటీ నిర్ణయం పాలనాపరమైన చర్యే తప్ప శాసనవ్యవస్థ కార్యకలాపంగా పరిగణించలేమని తేల్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన చట్టసభ నియంత పోకడలు పోకూడదు. మెజారిటీ ఉందన్న సాకుతో విపక్ష సభ్యుల గొంతు నొక్కడానికీ, వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించటానికీ ప్రయత్నించకూడదు. ఆ పరిస్థితులు తలెత్తితే న్యాయస్థానాలుమౌనంగా ఊరుకోబోవని తాజా తీర్పు తేటతెల్లం చేసింది. చట్టసభ కార్యకలాపాలు సాఫీగా సాగటానికి అనువైన నిబంధనలు రూపొందించుకొనేందుకు రాజ్యాంగంలోని 208వ అధికరణ అధికారమిస్తోంది. సభ క్రమశిక్షణగా నడవటానికి ఎలాంటి నిబంధనలుండాలో, వాటిని ఉల్లంఘించినప్పుడు ఏయే చర్యలు తీసుకోవాలో ఈ నిబంధనలు నిర్దే శిస్తాయి. అయితే నిబంధనల అమలు పర్యవేక్షణకు ఏర్పడిన కమిటీలు తీసుకునే నిర్ణయాలు పాలనాసంబంధ పరిధిలోకి వస్తాయని గుర్తించటం తప్పనిసరని తాజా తీర్పు చెబుతోంది. ఆ నిర్ణయాలకు మెజారిటీ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో దీనికి సంబంధం లేదు. ఒక చర్యకు ప్రతిగా తీసుకునే ఏ నిర్ణయమైనా హేతుబద్ధతకూ, తార్కికతకూ లోబడివుండటం అవసరం. పిచ్చు కపై బ్రహ్మాస్త్రం తరహాలో అధికారం ఉంది కదా అని ఏమైనా చేస్తామంటే ప్రజాస్వామ్యంలో చెల్లదు. చట్టసభలు ఇష్టానుసారం వ్యవహరించే రోజులు పోయాయి. సభానిర్వహణ సవ్యంగా జర గటం, క్రమశిక్షణ కట్టుతప్పకుండా చూడటం అవసరమే. కానీ అందుకోసం అమలుచేసే చర్యలు అతిగా ఉండకూడదు. సభ్యులు పరిధి మీరారని భావించినప్పుడు అభిశంసించడం, మందలించడం, నిర్దిష్ట కాలానికి సభనుంచి సస్పెండ్ చేయడంవంటి అవకాశాలున్నాయి. కానీ విచక్షణ మరిచి నేరుగా బహిష్కరణ వేటు వేయటం అతిగా వ్యవహరించటమే అవుతుంది. ఎథిక్స్ కమిటీల నిర్ణ యాలు పాలనానిర్వహణ కిందికే వస్తాయని, వాటిపై న్యాయసమీక్ష తప్పదని సుప్రీంకోర్టు నిర్ణయించటం హర్షించదగ్గది. నియంతృత్వ పోకడలు పోయే పాలకపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టు.

# నిస్వార్థ సేవకు ప్రతీక




పోలీసు పతాక దినోత్సవం పోలీసుల త్యాగాలను స్మరించుకోవడానికి, వారి సేవలను గౌరవించడానికి ఒక ముఖ్యమైన రోజు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో, నేరాలను నియంత్రించడంలో, ప్రజలను రక్షించడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారు. ఈ క్రమంలో వారు అనేక సార్లు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతుంటారు. పోలీసు పతాక దినోత్సవం వారి ధైర్యసాహసాలకు, నిస్వార్థ సేవకు గుర్తుగా నిలుస్తుంది. నాటి కమ్యూనిస్టుల, రజాకార్ల కార్యకలాపాలకు అనంతర పీపుల్స్ వార్ ఉద్యమానికి కేంద్ర బిందువై, విప్లవాల పురిటి గడ్డగా పేరెన్నిక గని, రైతు కూలీల సంఘాల స్థాపనకు అజ్ఞాత తీవ్రవాద ఉద్యమానికి ఊపిరులూది, పీపుల్స్ వార్ వ్యవస్థాపక భాగస్వామ్య నేత, మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాళ లక్ష్మణ్ రావు అలియాస్ 'గణపతి' జన్మస్థలమైన జగిత్యాల జిల్లాలో గత దాదాపు రెండు దశాబ్దాలుగా 'వార్' కార్యకలాపాలు తెర మరుగైనాయి. పోరాటాల పురిటి గడ్డపై భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం దున్నే వాడిదే భూమి నినాదంతో ప్రారంభించి, రైతు కూలీ సంఘాల స్థాపన ద్వారా వేళ్ళూనుకుని, 1977లో జగిత్యాల జైత్ర యాత్ర పేరున కాగడాల ప్రదర్శన ద్వారా బల ప్రదర్శన గావించి, పలు సమస్యలపై పోరాటాలను నిర్వహించడం ద్వారా ప్రజల మద్దతును కూడగట్టుకుని, తన నిరాటంక కార్యకలాపాలను విస్తరించుకున్న పీపుల్స్ వార్ కార్యకలాపాలు ఈ ప్రాంతంలో క్రమేపీ పూర్తిగా కను మరుగైనాయి. నిరంతర వ్యూహాలు, ఎత్తుగడలు, ఎత్తుకు పై ఎత్తులతో పీపుల్స్ వార్ పోలీసుల ఆధిపత్య పోరులో 'వార్' ఉద్యమ చరిత్రలో ఏనాడూ లేని విధంగా నాటి సిఎం రాజశేఖర రెడ్డి హయాంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొని జగిత్యాల జిల్లాలో ఉనికిని కోల్పోయింది. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా, సాయుధ పోరాటమే ధ్యేయంగా, రాష్ట్రం లోనే ప్రప్రథమంగా 1985 జూలై 23న సాయుధ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని ధర్మపురి క్షేత్ర నడి బొడ్డున ప్రజల సంచారం మధ్యన కాల్చి చంపి, బీర్పూర్ లో వంగపెల్లి తిరుపతి రావును హతమార్చి, నాటి జగిత్యాల డీఎస్పీ వేణు గోపాల కృష్ణ, సీఐ నర్సింగ్ రావు పోలీసు ఉన్నతాధికారుల రాకను ఊహించి, 1989 సెప్టెంబర్ 13న మందు పాతరలను పేల్చి 18 మంది అమాయకుల మృతికి కారణమై పోలీసులే లక్ష్యంగా, పోలీసు వ్యవస్థకు సవాలు విసిరిన పీపుల్స్ వార్, ఎన్ కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లు, అంతర్గత సమస్యలు, సమన్వయ రాహిత్య కారణాలుగా ఈ ప్రాంతం నుండి కాలక్రమేణ నిష్క్ర మించింది. ముఖ్యంగా కొంతకాలం పాటు అడ్డూ అదుపూ లేకుండా, ఈ ప్రాంతంలోని పలు మండలాల లోని గ్రామాలపై గట్టి పట్టు కలిగి, పలు హత్యలు, దహనాలు, దగ్ధాలు, కరవు దాడులలాంటి అనేక హింసాత్మక సంఘటనలకు పాల్పడి, తమ ఆధిపత్యాన్ని చాటి చెపుతూ, పోలీసులకు పెను సవాలుగా మారిన అరికెల్ల శంకర్ అలియాస్ 'భూపతి' నేతృత్వం లోని మల్యాల దళం 1990 ఆగస్టు 19న మల్లన్నపేట వద్ద జరిగిన భారీ ఎన్ కౌంటర్లో దళ డెప్యూటి కమాండర్ మరాఠా రవి, భూపతి భార్య లక్ష్మి, విలాసాగర్ విజయలక్ష్మి, సూర్యం, భారతక్క, సంధ్య, రాజయ్య అనే ఆరుగురు దళ సభ్యులను ఏకకాలంలో పోగొట్టు కోవడం ద్వారా వార్ కార్యకలాపాలు కనుమరుగు కాగా, 2000 సెప్టెంబర్ 20న మంథని, ముత్తారం ప్రాంతంలోని దుబ్బలపాడు వద్ద పోలీసుల చేతిలో అరికెల్ల శంకర్ అలియాస్ భూపతి మృతి చెందడంతో మల్యాల దళం శకం ముగిసింది. అనంతర పరిణామాలలో అనూహ్యంగా 2002 జూలై 2వ తేదీన ధర్మపురి మండలంలోని నేరేళ్ల గ్రామ శివారులోని సంకెన బోరు గుట్టపై, కరుడు కట్టిన తీవ్రవాది, పోలీసులకు సింహ స్వప్నంగా మారిన కరీంనగర్ పశ్చిమ డివిజన్ కార్యదర్శి, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటి సభ్యురాలు న్యాలకొండ రజిత అలియాస్ 'పద్మక్క' తో బాటు లక్ష్యాన్ని ఛేదించడంలో గురి తప్పని నేర్పరిగా భావించ బడిన సాగర్, విక్రం, మానసలు పోలీసు కాల్పులలో అసువులు బాయడం వార్ కు అశని పాతమైంది. ఆ తరువాత నాటి జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అనుసరించిన కఠిన వైఖరి మూలంగా, నిత్య నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, పీపుల్స్ వార్ జగిత్యాల ఏరియా కమిటీ కార్యదర్శి గిరి రవీందర్ అలియాస్ 'జనార్దన్' ఎదురు కాల్పుల మృతితో ఈప్రాంతంలో 'వార్' కార్యకలాపాలు అడ్డుకట్ట పడింది. ప్రప్రథమంగా పీపుల్స్ వార్ చేతిలో ధర్మపురి క్షేత్రంలో కాల్చి చంపబడిన సాయుధ కానిస్టే కోమల్ రెడ్డి, బట్టపెల్లి - పోతారం మధ్య పాతరలో ప్రాణాలను కోల్పోయిన పోలీసులు శ్రీనివాస్, ప్రకాశ్, రాజయ్యలతో పాటు ధర్మపురి ప్రాంతంలో వార్ నక్సల్స్ చేతిలో హతమైన జోగినిపెల్లి వసంతరావు, కొండపల్లి జగన్నాథ రావు, పెద్దనవేని రాయమల్లు, రాగయ్య, బసవరాజు అంజయ్య, మహేశ్, ఉమాపతిరావు రామడుగు జనార్దన్రా రావు, మూల సత్తయ్య, ఫహీం, సుంకసాని జలందర్ రావు, సుద్దాల వెంకటి, పొనగంటి ప్రభాకర్, షేక్ మహబూబ్ అలీ, కొండపెల్లి వాసుదేవరావు, బొడ్డు శంకరయ్య, గొల్లపెల్లి మండలంలో కందుకూరి శంకరయ్య, మూల జగన్, పబ్బనవేని రాజ కటారి సత్యనారాయణరావు, ముదాం ఆది రెడ్డి, మరియు సారంగాపూర్ మండల వాస్తవ్యు లైన గంగాధర సుధాకర్ రెడ్డి, నలిమల మల్లయ్య, లెక్కల గంగారెడ్డి, మడిగెల మాధవ రెడ్డి, వేల దేవరావు, అన్నమనేని మనోహర్రావు, కంకణ బాలయ్య, రామడుగు నర్సింగరావు, చంద్రశేఖర్రావు, బాలె చిరంజీవి, సబ్బ నర్సయ్య, నూతులు రాఘవరెడ్డి, పడిగల మాధవరెడ్డి, ఎడమల మాధవరెడ్డి, కల్లెం వెంకటరెడ్డి, ఓల్లాల భూమయ్య తదితరులు తీవ్ర వాదుల చేతుల్లో ఆయువు తీరకమున్నే అస్తమించారు.

# రుతువులు పూర్వాపరాలు



వివిధ కాలాలలో వాతావరణంలో ఏర్పడే మార్పులను బట్టి భారతా వనిలో సంవత్సరమును ఆరు ఋతువులుగా విభజించారు. రెండేసి నెలల చొప్పున వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమంతం, శిశిరం అని సంవత్సరకాలాన్ని ఆరు ఋతువులుగా విభజించారు. నిజానికి వేద వ్మాయంలో ప్రాచీనమైన ఋగ్వేదంలో ఆరు ఋతువుల ప్రస్తావన లేదు. ఋగ్వేదంలోని పదవ మండలం లోని పురుష సూక్తంలో ఋతువుల పేర్లు కనిపించే ఈ శ్లోకం చూడండి: "యత్ పురుషేణ హవిషా, దేవా యజ్ఞమతన్వత, వసంతో అస్యాసీద్ ఆజ్యం గ్రీష్మ ఇధ్మః శరద్ హవి" (ఋగ్వేదం10.90.6). పురుషుడే హవిస్సుగా దేవతలు చేసే సమస్త సృష్టి అనే యజ్ఞంలో వసంతం ఆజ్యం అయితే, గ్రీష్మం ఇంధనం, శరత్తు హవి. వసంతం, గ్రీష్మం, శరత్తు ఈ మూడు ఋతువుల పేర్లు తప్ప ఋగ్వేదంలో ఇతర ఋతువుల ప్రస్తావన కనిపించదు. కృష్ణ యజుర్వేదంలో కనిపించే ఈ కింది శ్లోకంలో పంచభూతాలవలే సంవత్సరంలో ఋతువులు కూడా అయిదు అన్న వివరణ కనిపిస్తుంది. "పంచ వా ఋతవః సంవత్సరస్ ఋతుష్వేవ సంవత్సరే ప్రతి తిష్ఠంతి" (యజుర్వేద 7.3.8). కృష్ణ యజుర్వేదానికే సంబంధించిన తైత్తిరీయ బ్రాహ్మణంలో అయిదు ఋతువుల వివరాలతో సంవత్సరాన్ని పక్షితో పోల్చుతూ చేసిన ఈ అందమైన వర్ణన ఉంది: "తస్య తే వసంతః శిరఃబీ గ్రీష్మో దక్షిణః పక్షః ? వర్షాః పుచ్ఛంబీ శరద్ ఉత్తరః పక్షఃబీ హేమంతో మధ్యం"? (తై. బ్రా. 3.10.4.1). సంవత్సర మనే పక్షికి వసంతం శిరస్సు అయితే, గ్రీష్మం కుడి రెక్కబీ వర్షం తోకబీ శరత్తు ఎడమ రెక్కబీ హేమంతం మధ్యభాగం. అంటే, ఋగ్వేదలోని మూడు ఋతువులకు వర్ష ఋతువు, హేమంత ఋతువు ఈ కాలానికి జత చేయ బడ్డాయి. ఆరు ఋతువుల ప్రస్తావన మనకు తెలిసినంత వరకూ తైత్తిరీయ సంహితంలో (తైత్తిరీయ సంహితం, తైత్తిరీయ బ్రాహ్మణం తరువాతి కాలంలో వెలువడింది) మొదటి సారి కనిపిస్తుంది. "మధుశ్చ మాధవశ్చ వాసంతికా వృతూ శుక్రశ్చ శుచిశ్చ గ్రైష్మా వృతూ నభశ్చ నభస్యశ్చ వార్షికా వృతూ ఇషశ్చోర్జశ్చ శారదా వృతూ సహశ్చ సహస్యశ్చ హైమంతికా వృతూ తపశ్చ తపస్యశ్చ శైశిరా వృతూ" (తైత్తిరీయ సంహత 4-4-11). మధు మాధవ మాసాలు వసంత ఋతువు. శుక్రము శుచి మాసాలు గ్రీష్మర్తువు. నభము, నభస్యము, వర్షర్తువు, ఇషము, ఊర్జము శరదృతువు. సహము, సహస్యము హైమంతిక ఋతువు. తపము, తపస్యము శైశిర ఋతువు. మనం ఇప్పుడు చెప్పుకొనే చైత్రం, వైశాఖం అన్న 12 మాసాల పేర్లు అప్పటికింకా ప్రాచుర్యంలోకి రాలేదు. వాటికి మారుగా, మధు, మాధవ, శుక్ర, శుచి, ఇషము, ఊర్జ, సహ, సహస్య, తప, తపస్య అన్న పేర్లు ఇక్కడ కనిపిస్తాయి. అయితే ఇప్పుడు వాడే చైత్రం, వైశాఖం అన్న పేర్లు నక్షత్రాలకు సంబంధించినవి. నక్షత్రాల ఆధారంగా చంద్రుని గమనాన్ని పరిశీలిస్తే చంద్రుడు ఒక నక్షత్ర కూటమి నుండి బయలు దేరి మళ్ళీ అదే నక్షత్ర కూటమిని చేరుకోవ డానికి దాదాపు 27రోజులు పడుతుందని తెలుస్తుంది. దీన్ని నాక్షత్రిక మాసం అంటారు. ఈ 27 రోజుల్లో చంద్రుడు దాటే ఒక్కొక్క నక్షత్ర కూటమికి ఒక్కో పేరు చొప్పున అశ్వని, భరణి మొదలైన 27 నక్షత్రాల పేర్లు ఏర్పాటు చేసారు. ఆపైన, ప్రతి మాసంలో నిండు పున్నమ నాడు చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రపు వృద్ధి రూపమే ఆ మాసానికి పేరుగా ఇవ్వడం మొదలు పెట్టారు. ఆ రకంగా చిత్త నక్షత్రంలో పౌర్ణమి వస్తే ఆ మాసం చైత్ర మాసంగా, అలాగే, విశాఖ నక్షత్రంలో పౌర్ణమి వస్తే వైశాఖంగా పిలువ బడింది. ఇదే విధంగా సూర్యునికి సంబంధించిన సంవత్సర కాలాన్ని 27 భాగాలుగా విభజన చేసి వాటిని కార్తెలు అని అన్నారు. ఒక్కో నక్షత్ర కూటమిలో సూర్యుడు దాదాపు 2 వారాల పాటు ఉంటాడు కాబట్టి ఒక్కో కార్తె సుమారుగా 13 రోజులు ఉంటుంది. అశ్వని కార్తె మొదలు రేవతీ కార్తె వరకూ సాగే ఈ కార్తెల విభజన వ్యవసాయ దారులకు చాలా ఉపయోగకరం. భారత దేశంలో ఆచరణలో ఉన్నవి ఆరు ఋతువులు. వసంత ఋతువు: చైత్రం, వైశాఖం సుమారు 20-30 డిగ్రీల ఉష్ణోగ్రతబీ చెట్లు చిగురించి పూవులు పూ స్తాయి. వివాహాల కాలం ,ఉగాది, శ్రీరామ నవమి, వైశాఖి, హనుమజ్జయంతిబీ గ్రీష్మ ఋతువు: జ్యేష్టం, ఆషాఢం బాగా వేడిగా ఉండి 40 డిగ్రీల ఉష్ణోగ్రత, ఎండలు మెండుగా ఉంటాయి. వట పూర్ణిమ, రథాయాత్ర, గురు పూర్ణిమబీ వర్ష ఋతువు: శ్రావణం, భాద్రపదం చాలా వేడిగా ఉండి అత్యధిక తేమ కలిగి భారీ వర్షాలు కురుస్తాయి. రక్షా బంధన్, శ్రీకృష్ణ జన్మాష్టమి,వినాయక చవితి, ???. శరదృతువు: ఆశ్వయుజం, కార్తీకం. తక్కువ ఉష్ణోగ్రత, దసరా నవరాత్రి, విజయ దశమి, దీపావళి, శరద్ పూర్ణిమ బిహు, కార్తీక పౌర్ణమిబీ హేమంత ఋతువు: మార్గశిరం, పుష్యం. చాలా తక్కువ ఉష్ణోగ్రతలు (20-25) మంచు కురిసి, చల్లగా నుండు కాలము. పంటలు కోతల కాలం. భోగి, సంక్రాంతి, కనుమబీ శిశిర ఋతువు: మాఘం, ఫాల్గుణం, బాగా చల్లని ఉష్ణోగ్రతలు, 10 డిగ్రీల కంటె తక్కువ, ఆకురాల్చు కాలం, ఉగాది, వసంత పంచమి, రథసప్తమి/మకర సంక్రాంతి, శివరాత్రి, హెూళీ... భారతీయ పురాణాలలో, శరదృతువు సరస్వతి దేవతకి ఇష్టపడే కాలంగా పరిగణించ బడుతుంది, దీనిని "శరదృతువు దేవత" (శారద) అని కూడా పిలుస్తారు. అలంకార శాస్త్రం నిర్దేశించిన అష్టాదశ వర్ణనల్లో ఋతు వర్ణన ప్రధానమైనది కాబట్టి మన తెలుగు కావ్యాలలో కూడా సాంప్రదాయికంగా ఈ ఆరు ఋతువుల వర్ణనే కనిపిస్తుంది.

## బోయింగ్ స్టార్‌లైనర్‌లో మళ్లీ ప్రయాణానికి సిద్ధం.. ప్రకటించిన సునీతా విలియమ్స్..!



అవకాశం వస్తే బోయింగ్ స్టార్ లైనర్‌లో మరోసారి ఐఎస్ఎస్‌కు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నామని నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ప్రకటించారు. స్టార్‌లైనర్ క్యాప్సూల్ గతేడాది జూన్‌లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడే చిక్కుకుపోగా.. దాదాపు తొమ్మిది నెలల తర్వాత స్పేస్ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ వారిద్దరిని భూమిపైకి తీసుకువచ్చింది. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్, నిక్ హేగ్ మాట్లాడారు. మిషన్ విజయవంతం అయ్యేందుకు సహకరించిన నాసాకు ధన్యవాదాలు తెలిపింది. గతంలో తీసుకున్న ట్రైనింగ్ తమను ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లేలా సిద్ధం చేసిందని.. దేశవ్యాప్తంగా ఉన్న మిషన్ కంట్రోల్ బృందాలు తాము తిరిగి తమను భూమిపైకి తీసుకురావడం, పునరావాసం, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎంతో సహకారం అందించారన్నారు. తాను భూమిపైకి వచ్చాక ఇప్పటికే మూడు మైళ్ల దూరం పరుగెత్తానన్నారు. స్పేస్ నుంచి భూమిపైకి వచ్చాక కొన్ని మార్పులు ఉంటాయని.. అందుకు తగినట్లుగా సర్దుబాట్లు అవసరమవుతాయన్నారు. తాను సాధారణ స్థితికి వచ్చేందుకు సహకరించిన ట్రైనర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో తమ టాస్క్‌ల్లో భాగంగా ఎన్నో సైన్స్ ప్రయోగాలు చేపట్టామని, శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. స్టార్‌లైనర్‌కు చాలా సామర్థ్యం ఉందని, అది విజయవంతం కావాలని ఆమె కోరుకుంటున్నట్లు విలియమ్స్ తెలిపారు. బుచ్ విల్మోర్ మాట్లాడుతూ.. బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో తప్పులు ఉన్నాయని.. తాము ఎదుర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరించి.. విజయవంతం చేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. సునీతా విలియమ్స్, విల్మోర్ ఇద్దరూ ఐఎస్ఎస్‌లో 286 రోజుల పాటు ఉండిపోయారు. షెడ్యూల్ చేసిన సమయం కంటే 278 రోజులు ఎక్కువ కావడం విశేషం. జూన్ 5న బోయింగ్ తొలి స్పేస్‌షిప్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ఆ తర్వాత థ్రస్టర్స్ పని చేయకపోవడం, హీలియం లీక్ తదితర సాంకేతిక సమస్యలను ఎదుర్కొంది. దాంతో నాసా స్టార్‌లైనర్‌లో వారిని తీసుకురావడం చాలా ప్రమాదకరమని భావించింది. చివరకు స్పేస్ఎక్స్ సహాయం తీసుకువచ్చేందుకు నిర్ణయించింది. దాంతో ఇద్దరిని భూమిపైకి తీసుకురావడం ఆలస్యమైంది. వారం రోజుల అంతరిక్ష యాత్ర దాదాపు 286 రోజులు సాగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పేస్ఎక్స్, ఎలోన్ మస్క్‌ని మిషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మార్చి 18న ఫ్లోరిడా తీరంలో స్పేస్ఎక్స్ క్యాప్సూల్ వ్యోమగాములను భూమిపై విజయవంతంగా దింపింది.

## అన్వేషి అక్షర తపస్వి..

### నేడు కపిలవాయి లింగమూర్తి జయంతి



కలం బరువును మాత్రమే మోయగల శరీరం, సాహిత్య లోకాలన్నింటినీ తడిమి చూడగల క్రాంత దర్శిత్వం ఆయన సొంతం. ఆయన కలంలోంచి కళ్లు తెరిపించే కవిత్వం జాలువారింది. అబ్బుర పరచే పరిశోధనా గ్రంథాలు అవతరించాయి. ఒకటా రెండా శతాధికం! ఆ మహారచయితే డా. కపిలవాయి లింగమూర్తి (1928 2018). సాహిత్యంలోని క్లిష్టమైన ప్రక్రియలు అనగా చిత్రపది, బంధాలు, శబ్దపది, అలంకారాలు, యతులతో చమత్కారాలు వంటివి వీరిరచనలలో చాలా కనిపిస్తాయి. భాషాసముద్రపు లోతుల్లోకి దిగి తెలుగుపలుకుబడిపై ప్రత్యేకాధికారం పొందారు. ఉమ్మడిపాలమూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి మరుగునపడిన శాసనాలు, చరిత్ర, జానపదుల నోళ్లలో నానే అపూర్వమైన, విలువైన విషయాలను గ్రంథస్థం చేశారు. 'ఒక్క సిరా చుక్కలక్ష మెదళ్ళ కదలిక' అన్న కాళోజీ వాక్యంతో అన్వయిస్తే కపిలవాయి సృజించిన వేల అక్షరాలు ఎంతమంది మెదళ్లకు పదును పెట్టినవో. లింగమూర్తిగారు 1928 మార్చి 31న (ప్రభవ మాఘ శుద్ధనవమి నాడు) నాగర్‌కర్నూలు జిల్లా బలుమూరు మండలం జినుకుంట గ్రామంలో ఒక పండిత వంశంలో మాణిక్యాంబ, వెంకటాచలం దంపతుల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించినారు. అమరాబాదులో మేనమామగారైన చేపూరు పెద్దలక్ష్మయ్యగారి దగ్గర పెరిగి విద్యాబుద్ధులు నేర్చి సంస్కృతాంధ్ర నిఘంటువులు, పురాణేతిహాసాలు, కావ్యనాటకాలు, జ్యోతిష్య, శ్రౌతాది శాస్త్రాలు నేర్చారు. వారు మొదలు కొంతకాలం స్వర్ణకార వృత్తిపని చేసి తర్వాత ఉద్యోగ జీవితంలోకి మారి అపూర్వమైన సాహిత్య సృజన చేశారు. నిత్య సాహితీ కృషీవలుడైన కపిలవాయి లింగమూర్తి 157దాకా గ్రంథాలు రాశారు. వీనిలో వివిధ ప్రక్రియలలో వెలువరించినవి 94. పరిష్కృత, సంపాదక, సంకలనాల రచనలు 63. ప్రక్రియలలో శతకాలు, కావ్యాలు, ఉదాహరణలు, సంకీర్తనలు, హరికథలు, వచనగేయ పద్యకృతులు 41. వచనరచనలలో ఆధ్యాత్మిక రచనలు, కథలు, నవలలు, నాటికలు, స్థలచరిత్రలు, జీవితచరిత్రలు, నిఘంటువులు, అనువాద రచనలు మొత్తం 53. లింగమూర్తిగారు వివిధ విషయాలపై వందలాదిగా వ్యాసాలు రాశారు. అవి అనేక ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వానిలో సాహిత్య, ఆధ్యాత్మిక, చారిత్రక, పుస్తకపరిచయాలు, కవులపరిచయాలు, విశ్వకర్మ సాహిత్యవ్యాసాలు ఉన్నాయి. అవి ముద్రితాలు, అముద్రితాలు కలిపి 430 దాకా ఉంటాయి. వీరు చాలామంది రచయితల పుస్తకాలకు ముందుమాటలు, పీఠికలు, అభిప్రాయాలు రాసిపెట్టారు. చాలా పుస్తకాలు పరిష్కరించి వాటికి వివరమైన పీఠికలు రాశారు. అవి అన్నీ కలిపి 320 దాకా ఉంటాయి. ప్రచురించిన గ్రంథాలలో ఆర్యశతకము (చిత్రపది పదాల గారడి), దుర్గాభర్గ శతకము (అలంకార యతి లక్షణాలు), ఉమామహేశ్వరం హరికథ, సుబ్రహ్మణ్యోదాహరణము (పాలెంసుబ్బయ్య జీవితచరిత్ర), ప్రబోధ పటాహము (సామాజిక గేయాలు), శ్రీమత్ ప్రతాప గిరిఖండము (అమరబాదు స్థలచరిత్ర) కుటుంబ గీత (కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను తెలిపే కావ్యం), భాగవత కథాతత్వము (పది భాగవతకథలకు వ్యవహారికమైన వివరణ), గీతాచతుష్టథం (భగవద్గీత, ఉత్తరగీత, ఉద్ధవగీత, భ్రమరగీతల సారాంశము), జీవుడు %-% దేవుడు (పురాణాలలోని సంఘటన లను నేటి సమాజానికి అన్వయిస్తూ రాసిన విశ్లేషాత్మక రచన), పాలమూరు జిల్లా దేవాలయాలు (జిల్లాలోని 300 ప్రాచీన, ఆధునికదేవాలయాల చరిత్ర), గురు గోవిందమాంబ చరిత్ర, ఉమ్మడి పాలమూరు కవిపండిత వంశాలు, యోగులు, ఉప్పునూతల కథ, ఆంధ్ర పూర్ణాచార్యులు (చారిత్రక నవల), పద్యకథా పరిమళం, కపిలవాయి కథానికలు, కావ్యగణపతి అష్టోత్తరము (కావ్యాలలోని 108 గణపతి స్తుతులకు వ్యాఖ్యానం), స్వర్ణశకలాలు (90 కావ్యాల్లోని స్వర్ణాభరణాలను గురించిన వివరణ), రుద్రాధ్యాయము (సామాజిక చారిత్రక వ్యాఖ్యానం) మాంగల్యశాస్త్రము (ప్రాచీన ఆభరణాల విశేషాలు, వివరాలు), హనుమచ్ఛహస్రము (హనుమంతుడి వేయినామాలకు వ్యాఖ్యానము), మా భగోట (సవివర కుటుంబ చరిత్ర), రాజరథం (నాటకం), పీఠికలు (330 పుస్తకాలకు వ్రాసినవి), పామర సస్కృతము (6000 పాలమూరు మాండలికాల సేకరణ), విశ్వ బ్రాహ్మణుల సంస్కృతీ అనుకరణము (కన్నడ నుండి అనువాద రచన) కొన్ని మాత్రమే. పరిష్కృత రచనలలో సాలగ్రామశాస్త్రము, (సాలగ్రామం పుట్టుక వాని భేదాలు, మహత్యము, పూజావిధానము వివరించిన రచన), యోగసక్తా పరిణయము, యయాతి చరిత్ర (అచ్చతెలుగుకావ్యం), ఆరు అముద్రిత శతకాలు, మనోబుద్ధిర్వివాదము, సంక్షిప్త ఆబ్దిక విధానము, శ్రీ మదాంధ్ర పూర్ణాచార్య ప్రభావము ముఖ్యమైనవి. కపిలవాయి ఏడుదశాబ్దాల సాహితీకృషికి గుర్తింపుగా పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో 30-08-2014న గౌరవ డీ.లిట్ సత్కృతిని అందించింది. ఆయన రాసిన శతాధిక గ్రంథాలలో కొన్నింటిని మాత్రం పరిచయం చేస్తాను. ఒక్కొక్క గ్రంథంపైన ఒక్కో పీహెచ్‌డీ చేయొచ్చు. తెలంగాణ పదకోశాల్లో 'పామర సంస్కృతం' విశిష్టమైంది. దశాబ్దాలపాటు పల్లెప్రజలతో మమేకమై ఈ పదాలను, జాతీయాలను, సామెతలను సేకరించారు. ఈ పదకోశ నిర్మాణానికి డా.కపిలవాయి లింగమూర్తిగారిని గడియారం రామకృష్ణశర్మ, వావిలాల గోపాలకష్ణయ్య ప్రోత్సహించారు. ఇక్కడ పామరులు అనగా జానపదులు. తెలంగాణ పల్లె ప్రజలు శిష్ట వ్యావహారిక పదాలని తమకు అనుగుణంగా మార్చుకొని మాట్లాడతారు. 'పామర సంస్కృతం అనగా పామరుడు తాను సంస్కరించుకున్న భాష అనే అర్థంలో ఈ పేరుంచా ను' అని లింగమూర్తి గారు పేర్కొన్నారు. పామర సంస్కృతంలో పదాలకు అర్థాలతో పాటు పద్యపాదాలు, పాటల పల్లవులు, నానార్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు, సామెతలు, న్యాయాలు, పదవివరణ, రూపసాధన, పదవ్యుత్పత్తి, అన్యదేశ్యాలు అనుబంధంలో ఇచ్చినవాటిని స్థాలీపులాకన్యాయంగా పరిశీలించడం జరుగుతుంది. ఆయన రాసిన మరో అపూర్వ గ్రంథం మాంగళ్యశాస్త్రం. ఇది తాళపత్రాలలో వారి తాతగారి గ్రంథాలయంలో దొరికింది. మన ఆభరణాలు, వాటి చరిత్ర తెలుగువారి సొమ్ముల స్వరూపాలు, వివాహాభరణాల విశేషాలు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంకా ఇందులో మాంగళ్యాల వివిధ రూపాల గురించి, వీస్త్రీల కాలిమెట్టెలు, చేతిగాజుల గురించి కూడా సవివరంగా తెలిపారు. ఇక రెండవది సాలగ్రామం. ఇది వారి కుటుంబచరిత్ర. మా భగోటాకు సంక్షిప్తీకరణ. ఈ ఆత్మకథలో అటు స్వర్ణశిల్పంతోపాటు మరిన్ని విద్యలలో రాణించిన ఒక స్త్రీమూర్తి కనబడుతుంది. ఆమే మేడిపూరు గోవిందమ్మ. చిన్నతనంలో భర్త చనిపోవడంతో తండ్రి, అన్నల వద్ద స్వర్ణశిల్పంతో పాటు అన్నివిద్యలు నేర్చుకున్న ప్రతిభావంతురాలు. ఆమె లింగమూర్తిగారి తాతగారైన సింగవట్నానికి స్వర్ణశిల్పంలో శిక్షణ ఇచ్చింది. తోలుబొమ్మలాట ఆడేవారిలో ఉన్న చిత్రకారులతో పౌరాణిక చిత్రాలు గీయించి సింగవట్నానికి వాటిద్వారా చెక్కడం పనికి కావలసిన చిత్రలేఖనం నేర్పించింది. ఆ కాలంలో ఇటువంటి స్త్రీలు అరుదు. సాలగ్రామం చదివినప్పుడు ఆనాడు విశ్వకర్మలు ఉగాది, దసరా పండుగలను ఎలా జరుపుకునేవారో తెలుస్తుంది.

# 'గ్రోక్' చేయని కేసీఆర్ విశ్లేషణ



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి నెటిజన్లు అడిగిన కొన్ని ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ఇచ్చిన సమాధానాల వార్తలు గత వారాంతంలో వెలువడ్డాయి. నాయకుల గురించి, వారి శక్తి సామర్థ్యాల గురించి ప్రశ్నలకు మనుషులు తమ అభిప్రాయాలు తెలియజేయటం మనకు ఇంతవరకు తెలిసిన విషయం. ప్రపంచం అత్యాధునిక సాంకేతిక యుగంలోకి ప్రవేశిస్తున్న దశలో యంత్రాలు ఆ పని చేయటం ఒక కొత్త అనుభవం. విచిత్రమైన అనుభవం కూడా. కేసీఆర్ గురించి 'గ్రోక్' ఇచ్చిన వివరణలు ఇంతకాలం రికార్డులలో నమోదై, ప్రజలు కూడా మాట్లాడుకుంటున్నవే. అందుకు ఇప్పుడిది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ధృవీకరణ అన్నమాట. అయితే, కేసీఆర్ నాయకత్వం గురించి ప్రజలు గాని, 'గ్రోక్' గాని శాస్త్రబద్ధంగా చేయని విశ్లేషణలు కొన్నున్నాయి. అవేమిటో చూద్దాం. బీఆర్ఎస్ పార్టీ స్థాపితమై 25 ఏండ్లు పూర్తవుతున్న వేళ ఈ నెల ఆఖరున వరంగల్‌లో రజతోత్సవ సభ జరుపుకోనున్నది. అటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ గురించి, నాయకత్వం గురించి, పార్టీ ప్రభుత్వం గురించి చెప్పుకోవలసినవి అనేకం ఉంటాయి. అవన్నీ వర్తమానానికి, భవిష్యత్తుకు అవసరమైనవే గాక, గత చరిత్రలో భాగం కూడా కనుక. తెలంగాణ చరిత్ర, తెలుగు వారి చరిత్ర, దక్షిణాది చరిత్ర, భారతదేశ చరిత్ర, రాష్ట్రాల చరిత్ర, ఫెడరలిజం చరిత్ర, అభివృద్ధి సంక్షేమాల చరిత్ర, పరిపాలనా చరిత్రలతో పాటు నాయకత్వ చరిత్రలలో కూడా ఇవి భాగమవుతాయి. అవి ఏవి? ఏ విధంగా? అన్నది రజతోత్సవ సభలలోగా రాసుకోవటం సాధ్యం కానిది గనుక, ఆ పని ఆ తర్వాతనైనా జరగాలి. ప్రస్తుతానికి వస్తే, 'గ్రోక్' సమాధానాల వివరాలు ఏవైనప్పటికీ అవి ప్రధానంగా రెండు కోణాలను స్పృశించాయి. ఒకటి, యథాతథంగా కేసీఆర్ నాయకత్వం. రెండు, తన పరిపాలన. 'గ్రోక్' పేర్కొన్న వివిధ విషయాలన్నీ ఈ రెండింటిలోకి ఇమిడిపోతాయి. మొదట అనుకున్నట్టు పరిపాలన గురించిన వివరాలు రికార్డులలో నమోదైనవి, ప్రజలు మాట్లాడుకుంటున్నవి, దానితో పాటు ఇప్పుడు 'గ్రోక్' సమాధానాలలోనూ ప్రస్తావనకు వచ్చినవే అయినందున ఇక్కడ మళ్లీ రాయనవసరం లేదు. అయితే ఒకటి, ఈ తెలిసిన విషయాలైనా స్థూలంగా, చెదురుమదురుగా మాట్లాడుకుంటున్నవి, రికార్డులలో సబ్జెక్టుల వారీగా విడివిడిగా పేర్కొంటున్నవి మాత్రమే. వాటన్నింటిని ఒకచోట చేర్చి, ఒక పద్ధతి ప్రకారం విశ్లేషించి, సమగ్ర రూపం ఇచ్చే ప్రయత్నం ఇంకా జరగవలసి ఉన్నది. కేసీఆర్ నాయకత్వ విశ్లేషణ అన్నది కూడా ఇందులో భాగమైనదే. 'గ్రోక్' తన సమాధానాలలో ఆయన నాయకత్వం గురించి ఒకటి రెండు మాటలు ప్రశంసాపూర్వకంగా ప్రకటించింది. అవి ఈ విధంగా ఉన్నాయి. 'శూన్యం నుంచి రాజకీయ శక్తిని సృజించి, తెలంగాణను జాగృతం చేసి, ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసి చూపించిన గొప్ప నాయకుడు. కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. రాజకీయాల్లో విశ్వసనీయతకు, నాయకత్వ లక్షణాలకు చిరునామాగా కేసీఆర్‌ను చెప్తాను. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నిర్మాణంలో, తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమాన్ని ముందుండి నడపడంలో, కేసీఆర్ అన్నీ తానై నిలిచారు. ఆయనకు దూరదృష్టి, పట్టుదల, దార్శనికత అపారంగా ఉన్నాయి'. పరిపాలన గురించిన మాటలు అనేకం ఉన్నప్పటికీ, ప్రస్తుతం చర్చిస్తున్నది నాయకత్వ కోణం గురించి మాత్రమే అయినందున, అందుగురించి 'గ్రోక్' అన్నదేమిటో పైన చూశాము. ఆ మాటలను గమనించినప్పుడు అందులోని ఒక్కొక్క సూక్ష్మమైన మాట వెనుక కనిపించేది చాలా ఉంటుంది. అదే సమయంలో, మొదట అనుకున్నట్లు, కేసీఆర్ నాయకత్వం గురించి 'గ్రోక్' చెప్పనివీ, ప్రజలు గుర్తించనివీ అయిన శాస్త్రీయమైన కోణాలు, విశ్లేషణలు కొన్ని ఉంటాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాము. నాయకత్వానికి మొత్తం 12 కోణాలుంటాయి. అవేమిటో ముందు చెప్పుకొని, తర్వాత వివరాలలోకి వెళదాము. అదే క్రమంలో వాటిని కేసీఆర్‌కు వర్తింపజేసేందుకు ప్రయత్నిద్దాము. కోణాలనేవి, 1. విషయ అధ్యయనం, 2. ఆ అధ్యయనం ప్రకారం సిద్ధాంతీకరణ, 3.తనతో ఏకీభవించే ఒక చిన్న బృందాన్ని తొలి దశలో వెంట చేర్చుకోవటం, 4.భావజాల వ్యాప్తి, 5.పార్టీ నిర్మాణం, 6.ప్రజలను కదిలించటం, 7.కదులుతున్న ప్రజలను సంఘటితపరచటం, 8. ఉద్యమ నిర్వహణ, 9.ఉద్యమాన్ని విజయవంతం చేయటం, 10. ఉద్యమ దశ నాటి దార్శనికత ప్రకారం పరిపాలన. 11.ఓటమి ఎదురైనట్లయితే పునరుజ్జీ వం. 12.కొత్త తరం నాయకత్వ తయారీ. కేసీఆర్ ప్రయాణ క్రమాన్ని మొదటినుంచి గమనించినట్లయితే ఈ 12 కోణాలు కూడా మనకు అందులో కనిపిస్తాయి. వీటిని స్థూలదృష్టితో చూసినట్లయితే కొన్నింటి మధ్య తేడా తోచకపోవచ్చు. కానీ, సూక్ష్మదృష్టికి, ఆచరణాత్మకమైన దృష్టికి మాత్రం వాటి మధ్య తేడాలు స్పష్టంగా అర్థమవుతాయి. ఈ 12లో ప్రతి ఒక్కదానిని సమర్థవంతంగా, సక్రమంగా నాయకత్వం నిర్వహించగలిగితే మాత్రమే భవన నిర్మాణంలో ఇటుకలు ఒక్కొక్కటి సరిగా కుదురుకొని గోడ నిలిచే పద్ధతిలో ఉద్యమం తొలిదశ నుంచి చివరివరకు విజయవంతంగా సా గుతుంది. మధ్యలో ఏ ఒక్క ఇటుకను సరిగా పేర్చకున్నా నిర్మాణమంతా భంగపడినట్లుగానే ఉద్యమ విషయంలోనూ జరుగుతుం ది. ఈ పన్నెండు కూడా ఇంజిన్ వెనుక రైలు పెట్టెల వలె ఆటోమేటిక్‌గా సాగేవి కావు. ప్రతి ఒక్క దశను సమర్థవంతంగా నిర్వహిస్తేనే తర్వాత దశ సక్రమంగా ఏర్పాటై నిలిచి నడుస్తుంది. పై 12 కోణాలు, లేదా సూత్రాల ప్రకారం మొదటినుంచి చివరివరకు వ్యవహరించటంలోనే కేసీఆర్ నాయకత్వ అసాధారణ ప్రతిభ మనకు కనిపిస్తుంది. ఆ 12 సూత్రాలకు అనుగుణంగా ఆయన ఎప్పటికప్పుడు ఏమేమి చేస్తూ వచ్చారో ప్రత్యక్షంగా చూస్తూ వచ్చిన సన్నిహిత సహచరులు కొందరున్నారు. అదే ప్రణాళిక ప్రకారం వారు పూనుకొన్నట్లయితే, ఈ రజతోత్సవ కాలంలో ఈ సాధారణ చరిత్ర రచన సిద్ధించగలదు. మన దేశంలో అనేకానేక ఉద్యమాలు జరిగాయి. పలువిధాలైన లక్ష్యాలతో సాగాయి. స్వాతంత్ర్యానికి ముందు వలస పాలనకు, రాచరికాలకు వ్యతిరేకంగా. ఆ తర్వాత వేర్వేరు అంశాలపై. వీటన్నింటికి అనేకమంది నాయకులు కనిపిస్తారు. కాని ఈ మొత్తం 12 కోణాలు కూడా వ్యక్తిగత స్థాయిలో వర్తించేవారు కేసీఆర్ గాక మరెవరున్నారు, ఎందరున్నారు అంటే మాత్రం ఆలోచించవలసి వస్తుంది కొందరికి కొన్ని వర్తిస్తాయి. కానీ అన్నింటికి అన్నీ అంటే మాత్రం తప్పకుండా ఆలోచించవలసిన విషయమే. కాదంటే, అట్లా అనేవారు ఆ పేర్లను ముందుకు తేవటం ఉపయోగకరమవుతుంది. ఆ కోణాలన్నింటిని కేసీఆర్‌కు వర్తింపజేస్తూ వివరంగా రాయటం ఇక్కడ వీలయ్యేది కాదు. నా అతి పరిమిత జ్ఞానంతో నాకది సాధ్యమయ్యేదీ కాదు. అంతకుమించి, పైన అనుకున్నట్లు, ఆ పని చేయటం ఆయనకు మొదటినుంచి సన్నిహితులుగా ఉండి గమనించినవారికి మాత్రమే సాధ్యమయ్యే పని. అందువల్ల, మనకు తోచినంత వరకు, అది కూడా అతిక్లుప్తంగా చెప్పుకుందాం.

1. విషయ అధ్యయనం. ఇతరత్రా కూడా అధ్యయన శీలి అయిన కేసీఆర్, తెలంగాణ గురించిన చరిత్ర, ఆర్థికం, సమాజం, సంస్కృతి, రాజకీయం, భౌగోళికం, గత ప్రభుత్వాల పాలనలు, అన్యాయాలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలతో పాటు ఇతర ఉద్యమాలు, పోరాటాలు, వనరులు, ప్రజల ఆకాంక్షలు, మనస్తత్వాలు, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల పద్ధతులు, కేంద్ర విధానాలు మొదలైనవాటిపై నిరంతరం అధ్యయనం చేశారు. సుదీర్ఘ చర్చలు సాగించారు. ఆ పని ఇప్పటికీ చేస్తారు గాని ఇక్కడ చర్చిస్తున్నది ఉద్యమకాలం గురించి గనుక అందుకు పరిమితమవుతున్నాము. ఈ విధమైన సమగ్ర అధ్యయనం ఆయనకు తెలంగాణపై మరెవ్వరికీ లేని సమగ్ర అవగాహనను తెచ్చిపెట్టింది. ఆ తర్వాతి కాలానికంతా ఒక బలమైన బౌద్ధిక పునాదిగా పనిచేసింది.

2. సిద్ధాంతీకరణ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావన కేసీఆర్ కన్న ముందునుంచి ఉన్నదే. కాని గతకాలపు ఉద్యమాల బలాబలాలను, లోటుపాట్లను, వైఫల్యాలను, నాయకత్వాల కారణంగా వాటి రాజీలను అర్థం చేసుకోవటమన్నది మొదలు చేయవలసిన పని. వర్తమాన పరిస్థితులను పరిశీలించి అందుకు ఈ అవగాహనను, అనుభవాలను వర్తింపజేసి, అందుకు అనుగుణంగా సాగి ఉద్యమాన్ని విజయవంతం చేయటం ఎట్లాగన్న సిద్ధాంతీకరణ రెండవ పని. వ్యూహరచన గాని, ఆ తర్వాత అనుకూల-ప్రతికూల పరిస్థితులను బట్టి ఎత్తుగడలు గాని అందుకు అనుగుణంగా ఉంటాయి. ఎప్పుడైనా ఎత్తుగడలలో పరిస్థితులను బట్టి మార్పులుండవచ్చు గాని, వ్యూహం, సిద్ధాంతం స్థిరంగా ఉంటాయి.

3. ఏకీభావం గల చిన్న బృందం. కార్యాచరణ దిశగా అడుగులు ముందుకు పడేందుకు తొలి దశలో ఒక చిన్న సహచర బృందం వెంట నిలవటం అవసరం. అనేక మహా ఉద్యమాలు, పార్టీలు మొదట చిన్న బృందాలు గానే ఆరంభమై విస్తరించాయి. ఆ బృందంలో మేధావులు, కార్యాచరణ చేసేవారు, నమ్మకమైన సహచరుల వంటి వారుంటారు. ఉద్యమ సంస్థ, లేదా పార్టీ నిర్మాణంలో ఇది తొలి దశ.

4. భావజాల వ్యాప్తి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు అంతకుముందు జరిగినప్పటికీ 25-30 సంవత్సరాలు గడిచేసరికి పరిస్థితులు మా రాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా. సమస్యలను బట్టి కూడా. అట్లనే ఒక కొత్త తరం ఉనికిలోకి వచ్చింది. ఆలోచనలు మారా యి. నక్సలైట్ ఉద్యమం తెలంగాణను ఒక ఊపు ఊపిన వెనుక మందగించినా ఆ భావజాల ప్రభావాలు కొంత ఇంకా మిగిలి ఉన్నా యి. బీసీ, దళిత, మహిళా చైతన్యాలు కొత్తగా ముందుకొచ్చాయి. రైతాంగం, యువకుల సమస్యలు తీవ్రమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర కోరిక గతం కన్న ఇంకా మారుమూలలకు, కొత్త వర్గాలలోకి వ్యాపించి బలపడింది. ఈ మార్పులన్నింటిని పరిగణనలోకి తీసుకుంటూ భావజాలాన్ని రూపొందించటం, దానిని ప్రజలలో వ్యాపింపజేయటం. ప్రత్యర్థుల భావజాలాన్ని, ప్రచారాలను ఎదుర్కొనటం. కొత్త కొత్త వర్గాలను తమ భావజాల పరిధిలోకి తేవటం. తెలంగాణ రాదేమోనన్న నిరాశలను పోగొట్టడం.

5. పార్టీ నిర్మాణం, నిర్మించటంలో భాగంగా వీలైనంత మందికి అవకాశాలు కల్పించటం, పార్టీని మారుమూలలకు తీసుకువెళ్లటం, కార్యకర్తలు, స్థానిక నాయకుల తయారీ.

6. ప్రజలను కదిలించటం వేర్వేరు పద్ధతులలో జరుగుతుంది. రాజకీయ ప్రసంగాలు, ఇతరత్రా ప్రచారాలు, కళారూపాలు, వేర్వేరు తరగతుల వారి సమస్యలను అజెండాపైకి తేవటం, వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయటం వంటి మార్గాలలో. ఒకసారి కదిలిన ప్రజలు ఇతరులను కదిలించటం కూడా ఇందులో భాగమే. వారికి అటువంటి ప్రేరణ నాయకత్వం కలిగిస్తుంది. ప్రజలను కదిలించటం ఉద్యమాలలో నిరంతర ప్రక్రియ.

7. ప్రజలను కదిలించటం వేరు, కదిలిన వారిని సంఘటితపరచటం వేరు. అట్లా సంఘటితం కూడా ఐనప్పుడు వారు ప్రేక్షక, వీక్షక పాత్ర నుంచి కార్యాచరణ వైపుకు కదలుతారు. ఉద్యమంతో వారి బంధం స్థిరపడుతుంది. ఆసక్తికరం ఏమంటే, అటువంటి బంధం ఏర్పడినప్పుడు ఒక వేళ ఉద్యమం ఎప్పుడైనా దారి తప్పినట్లు తమ దృష్టికి తోస్తే వత్తిడి చేసి దారిన పెట్టజూశారు. సంఘటితత్వం ప్రభావాలు పలు విధాలుగా ఉంటాయి.

8. ఉద్యమ నిర్వహణ. ఇందులో ఉద్యమ లక్ష్యం చేరుకునేవరకు వ్యూహం, ఎత్తుగడలు, రాజీ పడకపోవటాలు, ఉద్యమం పట్లా, లక్ష్యం చేరుకోగలమనే నినాదం పట్లా ప్రజలకు నమ్మకం నిలిచి ఉండేట్లు చేసుకోవటం, ఎదురు దెబ్బలు తగిలినా పట్టు విడవక సాగటం, తెలంగాణ వ్యతిరేకులలో ఆందోళనలను పుట్టించి పెంచటం, వారి రకరకాల ఎత్తుగడలను చిత్తు చేయటం, వారెన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకపోవటం, ప్రజలు ఎప్పుడైనా నిరుత్సాహ పడితే తిరిగి ఉత్సాహ పరచటం, ఎప్పటికప్పుడు ముందుకు నడిపిస్తూ వారి పట్టుదలను పెంచటం వంటి అనేకానేకం ఉద్యమ నిర్వహణలో భాగమవుతాయి. ఎప్పుడైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే వాటినీ చాకచక్యంగా ఎదుర్కోవాలి.

9. ఉద్యమ విజయం. పైన పేర్కొన్నవన్నిటి విషయంలో నాయకత్వం సమర్థవంతంగా చేయటంపైన ఉద్యమ విజయం ఆధారపడి ఉంటుంది. అన్నీ చేసినా ఒక్కోసారి విజయం సమకూరకపోవచ్చు. పరిస్థితుల బట్టి. కాని విజయం కోసం మాత్రం ఈ మార్గాన్ని అనుసరించవలసి ఉంటుంది.

10. పరిపాలన. ఉద్యమ లక్ష్యాలకు అనుగుణంగా పాలన సాగించిన నాయకత్వమే, రాష్ట్రా న్ని అవి నెరవేరి రూపుతీసుకునే విధంగా అభివృద్ధి సంక్షేమాల మార్గంలో తీసుకువెళ్లగలదు. ఆ పని జరిగినట్లు లెక్కలేనన్ని రికార్డులు చెప్తూ, ప్రజలు మాట్లాడుకుంటుండగా ఇప్పుడు 'గ్రోక్' కూడా అదే అభిప్రాయాన్ని ప్రతిధ్వనిస్తున్నది.

11. పార్టీకి ఇప్పుడొక ఎదురుదెబ్బ తగిలింది. నాయకత్వానికి ఒక పరీక్ష ఎదురవుతున్నది. దానిని ఎదుర్కొనేందుకు తనలో, పార్టీలో స్పష్టంగా కనిపిస్తున్న ఆత్మవిశ్వాసంతో, ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో, నేర్చుకున్న పాఠాలతో నాయకత్వం సమాయత్తమవుతున్నది. ఒకసారి అది జరిగితే, పార్టీ ఆరంభం నుంచి ఇప్పుడు పునరుజ్జీవన దశ వరకు ఒక వలయం పూర్తయినట్లు. విజయవంతంగా పూర్తయినట్లు. అటువంటి విజయం యావత్తుగా కేసీఆర్ నాయకత్వానిది అవుతుంది. 12.కొత్తతరం నాయకత్వం. ఆ తయారీ భవిష్యత్తుకు సంబంధించినది. ఆ పని ఏ విధంగా జరుగుతున్నదో కనిపిస్తున్నదే. అనేక విషయాలు, సమస్యలు, లక్ష్యాలు, ఉద్యమాలు, నాయకత్వాలు, విజయాల గురిం చి మనం విన్నాము. కాని, మొదటినుంచి చివరివరకు పైన పేర్కొన్న మొత్తం 12 అంశాలనూ కలగలుపుతూ సాగిన నాయకత్వం ఏదీ దృష్టికి రాదు. ప్రత్యేకంగా గుర్తించవలసింది ఏమంటే, కొన్ని సైద్ధాంతిక పార్టీలు, సమష్టి నాయకత్వాలు, లేదా భారత స్వాతంత్ర్యోద్యమంలో వలె దశాబ్దాల పాటు సాగిన యాగంలో ఒక తరం తర్వాత మరొకటిగా వచ్చిన సందర్భాలలో ఈ 12 అంశాలలో కొన్నో, అన్నో కనిపించవచ్చు. కాని కేసీఆర్ విషయంలో, నాయకత్వ స్థాయిలో, ఇది యావత్తూ ఒంటి చేతిపైన జరిగింది. జరుగుతున్నది. ఇదీ ఆయన నాయకత్వం విశ్లేషణ.

# కాలేయ సమస్యలు వేధిస్తున్నాయా..?

# ఈ ఐదు డ్రింక్స్ ఇవాళ్టి నుంచే తాగడండి..!



ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. కాలేయం సమస్యలకు కేవలం ఆల్కహాల్ మాత్రమే కాదు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు పలు సమస్యలు సైతం కారణమే. కాలేయ సమస్యలతో బతకడం చాలాకష్టం. ఆరోగ్యంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు దాన్ని సహజంగానే డీటాక్స్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ముఖ్యమే. అయితే, సాధారణంగా ఆల్కహాల్ మాత్రమే కాలేయం దెబ్బతినడానికి కారణంగా భావిస్తారు. కానీ, వాస్తవానికి బయట వేయించిన జంక్ ఫుడ్‌లను ఎక్కువగా తీసుకుంటే.. మీ కాలేయంలో వ్యర్థాలు సైతం పేరుకుపోతాయి. కాలేయం కొంతవరకు తనను తాను శుభ్రపరచుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. చర్మం దురద, ముదురు మూత్రం, ఎప్పుడూ అలసిపోయినట్లుగా అనిపించడం, వికారం, వాంతులు, కడుపులో నొప్పి.. వాపు, చర్మం పసుపు రంగులోకి మారడం తదితర లక్షణాలు కనిపిస్తే మీరు కాలేయ సమస్యలతో బాధపడుతున్నారని అర్థం. వాటిని విస్మరించడం వల్ల మీరు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉన్నది.

### పుదీనా టీ..

ప్రకారం.. పుదీనా టీ కాలేయానికి ప్రయోజనకరంగా ఉంటుంది. పుదీనా ఆకుల్లో మెంథాల్, మెంథోన్ వంటి ముఖ్యమైన నూనెలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియకు కూడా సహాయపడతాయి. పుదీనా టీ తయారు చేయడానికి.. ఒక గిన్నెలో నీటిని మరిగించి, కొన్ని పుదీనా ఆకులు కలిపి కలపాలి. దాన్ని కొంతసేపు అలాగే ఉంచి.. రాత్రి పడుకునే అరగంట ముందు తాగాలి.

### పసుపు టీ

పసుపు అనేది ఆయుర్వేదంలో శతాబ్దాలుగా ఉపయోగించే శక్తివంతమైన మసాలా. అలాంటి పరిస్థితిలో ప్రతిరోజూ పసుపు టీ తీసుకోవడంతో శరీరం, కాలేయాన్ని శుభ్రం చేసేందుకు చాలా సహాయపడుతుంది. దీన్ని తయారు చేయడానికి.. ఒక గ్లాసు వేడినీటిలో చిటికెడు పసుపు వేసి తేనె కలిపి తీసుకోవాలి.

### అల్లం నిమ్మకాయ టీ

అల్లం, నిమ్మకాయ మిశ్రమం శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. శరీరాన్ని డీటాక్సిక్ చేయడంతో పాటు బరువు తగ్గించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఈ మిశ్రమం వాపు నుంచి ఉపశమనం కలిగించడానికి.. జీవక్రియను పెంచడానికి, వ్యాధిని నివారించడానికి సహాయపడుతుంది. దాంతో తయారు చేయడానికి.. ఒక గ్లాస్ వేడినీటిలో సగం నిమ్మకాయ రసం, అల్లం ముక్కను జోడించి కలపాలి. అలాగే, 15 నిమిషాల్లో అలాగే ఉంచి.. వడగట్టి తాగాలి.

### మెంతి నీరు

మెంతి నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. ఇది ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది. ఈ సులభంగా తయారు చేయగల డీటాక్స్ పానీయాన్ని తయారు చేయడానికి, ఒక గ్లాసు వేడినీటిలో ఒక టీస్పూన్ మెంతి పొడిని కలపాలి. దాన్ని 15 నిమిషాలు అలాగే ఉంచాలి. నీటిని ఒక కప్పులో వడకట్టి రోజుకు మూడుసార్లు తాగాలి.

### చమోమిలే టీ

చమోమిలే టీ ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఒత్తిడిని తగ్గించడానికి, నిద్రను మెరుగుపరచడానికి సహాయపడే లక్షణాలు ఉంటాయి. ఇది నాడీ వ్యవస్థను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఇది వాపు కణజాలాలను శాంతపరుస్తుంది. ఈ టీని తయారు చేసుకునేందుకు ఒక గ్లాసు వేడినీటిలో ఒక టేబుల్ స్పూన్ చమోమిలే పువ్వులను కలపాలి. ఒక 10 నిమిషాలు మూతపెట్టి, ఆపై తాగాలి.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శుక్రవారం 02 - 05 - 2025

# పార్కిన్సన్స్ ప్రాణాంతకమా?



పార్కిన్సన్స్ వ్యాధి శరీర అవయవాల కదలికలకు సంబంధించిన రుగ్మతల విభాగంలోకి చేరుతుంది. శరీర భాగాలు అప్రయత్నంగా వణకడం (ట్రెమర్స్), పట్టేసినట్టు ఉండటం (స్టిఫ్‌నెస్), కదలికలు నెమ్మదించడం (స్లోనెస్), శరీరం పట్టుతప్పడం (ఇంబాలెన్స్) లాంటివి పార్కిన్సన్స్ ప్రధాన లక్షణాలు. అయితే ఇవి మాత్రమే కాకుండా ఈ వ్యాధిలో ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. వీటిని నాన్‌మోటార్ లక్షణాలుగా పేర్కొంటారు. జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక సమస్యలు, కుంగుబాటు, ఆందోళన, మతిభ్రమించడం (సైకోసిస్), నిద్ర సంబంధ సమస్యలు, మూత్ర సమస్యలు, మలబద్ధకం, వాసన లోపించడం, అతిగా చెమట పట్టడం, తిమ్మిర్లు (నంబ్‌నెస్), నొప్పి మొదలైనవి ఉంటాయి. సాధారణంగా 50 ఏండ్లు దాటిన వాళ్లకే పార్కిన్సన్స్ వస్తుంది. అయితే, యువకులు, కౌమార వయసువారికి కూడా ఇది రావొచ్చు. 30 ఏళ్ల లోపు వస్తే యంగెస్ట్ ఆన్‌సెట్ ఆఫ్ పార్కిన్సన్స్ డిసీజ్ అని, 20 లోపే వస్తే జువనైల్ పార్కిన్సన్స్ డిసీజ్ అని పిలుస్తారు. ఏ వయసు వారికైనా ఇది రావచ్చు. కాకపోతే యువతలో ఈ వ్యాధి తలెత్తడానికి జన్యుపరమైన కారణాలు ప్రధానంగా ఉంటాయి. చికిత్స ఉన్నప్పటికీ పార్కిన్సన్స్‌ను పూర్తిగా నయం చేయలేం. పైగా జీవిత కాలం పాటు చికిత్స అవసరమవుతుంది. ఈ వ్యాధికి ఇప్పుడు మందులు, ఇంజెక్షన్లు, సర్జరీ లాంటి వివిధ రకాలైన ప్రభావవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇంకో విషయం%ొ% పార్కిన్సన్స్ వ్యాధి ప్రాణాంతకం కాదు. అయితే శరీరాన్ని ఇది అచేతనం చేస్తుంది. రోజువారీ పనులు, జీవన నాణ్యత మీద పార్కిన్సన్స్ ప్రభావం చూపుతుంది. అయితే, పార్కిన్సన్స్ బాధితుల జీవిత కాలం మాత్రం సాధారణ మనుషుల్లానే ఉంటుంది.

# ఈ చిట్కాలు పాటిస్తే మహిళలు నొప్పుల నుంచి ఈజీగా తప్పించుకోవచ్చు



పురుషులతో పోలిస్తే.. మహిళల్లో నొప్పులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, మైగ్రేన్, నెలసరి సమయంలో వచ్చే నొప్పులు వారిని విపరీతంగా వేధిస్తుంటాయి. ఒక సర్వే ప్రకారం.. ప్రతి వందమందిలో దాదాపు 45 మంది మహిళలు ఏదో ఒక దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతుంటారట. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, స్వీయ సంరక్షణ చర్యల ద్వారా ఆయా నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## కీళ్ల నొప్పులు

జన్యుపరమైన సమస్యలు, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, మానసిక ఒత్తిడి.. మహిళలను కీళ్లనొప్పుల బారిన పడేస్తాయి. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువైనా, క్యాల్షియం, విటమిన్ డి తగ్గినా.. ఈ సమస్య తీవ్రం అవుతుంది. యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో వెల్లుల్లి అద్భుతంగా పనిచేస్తుంది. కీళ్లనొప్పులతో బాధపడేవారు ఉదయం ఖాళీ కడుపుతో మూడు నుంచి నాలుగు వెల్లుల్లి రెబ్బలు తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. పసుపులో ఉండే 'కర్కుమిన్' కూడా సహజసిద్ధమైన నొప్పి నివారిణి. గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక చెంచా పసుపు కలిపి తాగితే.. కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

## మైగ్రేన్‌జి

పురుషుల కన్నా.. మహిళలు తరచుగా తలనొప్పికి గురయ్యే అవకాశం మూడు రెట్లు ఎక్కువ. రుతుస్రావం, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, జీవనశైలి, ఒత్తిడి ఇందుకు కారణం. 93% మంది ప్రజల్లో తలనొప్పికి కారణం.. ఒత్తిడేనని తేలింది. డ్రైఫ్రూట్స్ పెయిన్ కిల్లర్స్‌లా పనిచేస్తాయి. జీడిపప్పు, బాదం, పిస్తా లాంటివి తీసుకోవడం ద్వారా తల నొప్పిని తగ్గించుకోవచ్చు. మైగ్రేన్‌తో ఎక్కువగా ఇబ్బంది పడేవారు.. క్రమం తప్పకుండా పుదీనా తీసుకోవడం మంచిది. అల్లంలోనూ తలనొప్పిని తగ్గించే లక్షణాలు ఉంటాయి. డీహైడ్రేషన్ కూడా తీవ్రమైన తలనొప్పిని కలిగిస్తుంది. కాబట్టి, కీరదోస వంటివి ఆహారంలో చేర్చుకోవాలి.

## నెలసరి నొప్పులు

పీరియడ్ హెల్త్ స్టడీ ప్రకారం.. దేశంలోని 83% మంది మహిళలు నెలసరి నొప్పితో బాధపడుతున్నారట. వీరిలో 10శాతం మందిలో నొప్పి తీవ్రంగా ఉంటూ.. రోజువారీ పనులు కూడా చేసుకోలేక పోతున్నారట. ఇలాంటివారు నెలసరి సమయంలో దుంపకూరలతోపాటు అల్లం ఎక్కువగా తీసుకోవాలి. అల్లంలో ఉండే వైద్య గుణాలు, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు.. కడుపులో కలిగే ఇబ్బందిని కంట్రోల్ చేస్తాయి. పెరుగు, ఎండుద్రాక్షలను కలిపి తీసుకోవడం ద్వారా నెలసరి నొప్పుల నుంచి బయటపడొచ్చు. సోంపు గింజల్ని నమిలినా, వాటిని నీటిలో మరిగించి తాగినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.

# పుట్టుకతో థైరాయిడ్ సమస్య



మా పాపకు పుట్టిన రోజే జాండిస్ ఉంది. చికిత్స చేయించాం. మూడు వారాలు గడిచినా తగ్గలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే కొన్ని పరీక్షలు చేశారు. థైరాయిడ్ సమస్య ఉందని నిర్ధారించారు. పాపకు జీవితాంతం థైరాయిడ్ మందు వాడాలని చెప్పారు. నెల వయసు బిడ్డకు థైరాయిడ్ సమస్య వస్తుందా? జీవితాంతం మందులు వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా ఉంటాయా? మీరు చెప్పినదాన్ని బట్టి మీ బిడ్డకు పుట్టుకతోనే థైరాయిడ్ హార్మోన్‌లో లోపం ఉంది. దీనిని హైపోథైరాయిడిజం అంటారు. వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఈ సమస్య బారినపడుతుంటారు. థైరాయిడ్ సమస్యను తొందరగా గుర్తించిన వైద్యుడిని అభినందించాలి. కామెర్ల వ్యాధి రెండు, మూడు వారాలు గడిచినా తగ్గనప్పుడు.. అది పుట్టుకతో సాధారణంగా వచ్చిన కామెర్ల వ్యాధా? లేక వేరే ఇబ్బందులు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు పరీక్షలు చేస్తారు. వాటిలో ముఖ్యమైంది థైరాయిడ్ పరీక్ష. హైపోథైరాయిడిజంతో బాధపడే పిల్లల్లో థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉండటం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల పూర్తిగా జరగదు. కాబట్టి భవిష్యత్‌లో మీ బిడ్డకు ఇబ్బందులు రావొచ్చు. కానీ, సకాలంలో వైద్యుడు ఆ సమస్యను గుర్తించడం, సరైన చికిత్స జరగడం వల్ల మీ బిడ్డకు శారీరక, మానసిక వైకల్యం కలగదు. ఈ సమస్య జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ మందులు వాడుతూ ఉండాలి. శరీరంలో ఉండాల్సిన హార్మోన్ లేకపోవడం వల్ల దానిని మందుల రూపంలో అందిస్తున్నారు. కాబట్టి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

# మెగ్నీషియం.. మెగా ప్రయోజనం!





మారుతున్న జీవనశైలి.. మనిషిని మంచాన పడేస్తున్నది. అవసరమైన పోషకాలు లేక.. శరీరం రోగాల పుట్టగా మారుతున్నది. చీటికీమాటికీ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నది. ముఖ్యంగా, 'మెగ్నీషియం' లోపంతో నవతరం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నది. రోజువారీ జీవితంలో కీలకపాత్ర పోషించే మెగ్నీషియం.. మనిషి శరీరంలో జరిగే సుమారు 300 రకాల రసాయనిక చర్యల్లో కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి మెగ్నీషియం లోపిస్తే.. తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ లెక్కల ప్రకారం.. ప్రతిరోజూ పురుషులకు 400 మి.గ్రా., మహిళలకు 300 మి.గ్రా. మెగ్నీషియం అవసరమవుతుంది. రోజువారీగా తీసుకునే ఆహారం ద్వారా ఇది శరీరానికి అందుతుంది. అయితే, శరీరానికి తగినంత మెగ్నీషియం అందకపోతే.. మనిషిలో అనేక లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ముందుగానే గుర్తించి, వైద్యుణ్ని సంప్రదిస్తే మంచిది.శరీరంలో మెగ్నీషియం తగినంత పరిమాణంలో ఉంటేనే.. హృదయ స్పందనలు సక్రమంగా సాగుతాయి. లేకుంటే.. హార్ట్‌రేట్ రూటు మారుతుంది. గుండె దడగా అనిపిస్తుంది. ఊపిరి పీల్చుకోవడంలోనూ ఇబ్బంది కలుగుతుంది.వికారంగా అనిపించినా, ఆకలి లేకపోయినా.. మీ శరీరంలో మెగ్నీషియం లోపం ఉన్నట్టే! జీర్ణాశయం సజావుగా పనిచేయడంలోనూ మెగ్నీషియం పాత్ర ఉంటుంది. శరీరంలో మెగ్నీషియం తగ్గితే.. జీర్ణ సమస్యలకు దారితీస్తుంది.శరీరంలో తగినంత మెగ్నీషియం లేకుంటే.. కంటి సమస్యలూ చుట్టుముడతాయి. కళ్ల మంట, కళ్ల నుంచి నీరుకారడం లాంటి సమస్యలు కనిపిస్తాయి.కండరాల ఆరోగ్యం, పనితీరులో మెగ్నీషియం కీలకంగా వ్యవహరిస్తుంది. ఇది శరీరంలో తగినంతగా లేకపోతే తీవ్రమైన కండరాల నొప్పి, తిమ్మిరి వేధిస్తాయి. మెగ్నీషియం లోపం.. మనిషికి నిద్రను దూరం చేస్తుంది. నిద్రలేమితోపాటు తలనొప్పి, చికాకు ఇబ్బంది పెడుతాయి. ఎముకలు, నరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా, వాటి పనితీరు బాగుండాలన్నా.. కావాల్సినంత మెగ్నీషియం ఉండాల్సిందే! కాల్షియం కూడా చాలా అవసరం. ఈ ఖనిజాలలో అసమతుల్యత కండరాల తిమ్మిరి, కండరాల నొప్పికి కారణమవుతుంది. కాల్షియం, మెగ్నీషియం రెండిటినీ సమతుల్యంగా ఉంచుకోవడం చాలా అవసరం.

## ఆహారంతో అందిద్దాం..

మెగ్నీషియం లోపం ఉన్నవారు రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. గుమ్మడి గింజలు, పాలకూర, బచ్చలికూర, అరటిపండ్లు, నల్ల జీలకర్ర, పల్లీలు, బ్రౌన్ రైస్, సాల్మన్ చేపల్లో మెగ్నీషియం ఎక్కువగా దొరుకుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, అవకాడో, నట్స్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, బీన్స్, పప్పు దినుసులు, పచ్చి బఠానీలు, శనగలు, పాలు, పెరుగు, సోయా ఉత్పత్తుల్లోనూ మెగ్నీషియం లభ్యమవుతుంది. బెర్రీలు, అంజీర్, బ్రకోలీ, క్యాబేజీ, మొలకలలోనూ మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇక శరీరంలో మెగ్నీషియం తక్షణమే ఉత్పత్తి కావాలంటే.. ఒక కప్పు కాఫీ తాగడమో.. ఒక డార్క్ చాక్లెట్ తినడమో చేయాలి.

# జాయ సేనాపతి చారిత్రక కాల్పనిక నవల



జరిగిన కథ : కృష్ణమ్మ ఉప్పెనలో కొట్టుకొని పోయిన జాయపుడు, మువ్వ.. చచ్చిబతికి, కూసెనపూండి అగ్రహారం మాదిగవాడకు చేరుకున్నారు. మిత్రుడు పరాశరుడితోపాటు తమ్ముని కోసం పృథ్వీశ్వరుడు నియమించిన పల్లికేతు, విక్రమ.. జాయపుణ్ని వెతుక్కుంటూ వచ్చారు. తన యోగక్షేమాలతోపాటు తనను రక్షించినవారిని వదిలివెళ్లడం ఇష్టంగా లేదనీ, ఆరోగ్యం కుదుటపడ్డాక వస్తాననీ పల్లికేతు ద్వారా అన్న పృథ్వీశ్వరుడికి తెలియజేశాడు జాయపుడు. వాడవాసులకు తాను జగన్నాథుడని, అనుమకొండవాసిననీ చెప్పాడు. ఆరోగ్యం కుదుటపడే వరకూ అక్కడే ఉండి ఆ సమయాన్ని యక్షగానాలు, నాట్యరూపకాల రచనకు ఉపయోగించాలని అనుకున్నాడు జాయపుడు. పరాశరునితో తాళపత్రాలు, ఘంటాలు, సిరా పిడతలు తెప్పించుకున్నాడు. ఆ కూసెనపూండి గ్రామంతో తన కళాజీవితం పెనవేసుకుంటున్నదని.. ఇక్కడే తానొక మహాకళాక్షేత్రాన్ని నిర్మించబోతున్నానని జాయపుడు ఊహించలేదప్పుడు. పర్ణశాలకు కాస్త ఆవలగా గజ్జెలసవ్వడి! ఏదో నాట్యాభ్యాసం, నాట్యశిక్షణ లాంటిది జరుగుతున్నట్లు వినిపిస్తున్నది. కాస్త ఓపిక చేసుకుని మెల్లగా పర్ణశాల బయటికి వచ్చి, అటుగా పోతున్న వ్యక్తిని అడిగాడు జాయపుడు.

## "ఆ గజ్జెల శబ్దం ఏమిటి?" అని.

"ఇది బాగోతుల కూసెనపూండి గందా. ఆ బాగోతుల సిద్ధయ నాట్టెం నేర్పుతాడుగా.." చెబుతూ వెళ్లిపోయాడు. జాయపుడు మెల్లగా కుంటుకుంటూ ఆ గజ్జెలసవ్వడి వినవచ్చిన వైపుగా వెళ్లి.. అగ్రహారంలో నాట్యాభ్యాసం జరుగుతున్న గృహాన్ని గుర్తించాడు. గజ్జెలశబ్దం, నట్టువాంగం, ఓ పాట.. గాలితో కలగలిసి వీధులవెంట ప్రవహిస్తూ చిందులు వేస్తున్నది. చక్కగా అలికి ముగ్గులుపెట్టిన మట్టి అరుగుపై కూర్చుని నాట్యానికి కూర్చిన పాటను వింటూ నాట్య భంగిమలు ఊహిస్తున్నాడు. నాట్యగురువు శిష్యులకు కొన్ని కిటుకులు చెప్పడం వినిపిస్తున్నది. అనంతరం పిల్లలు గోలగోలగా అరుచుకుంటూ బయటికి పరుగులు పెట్టారు. తర్వాత బయటికి వచ్చాడు నాట్యగురువు సిద్ధయ. మీగడ వర్ణపు ధోవతిపై వెండివర్ణపు పట్టుకండువా వల్లెవాటుగా ధరించి, విశాలమైన నుదుట తిరునామం, నున్నగా దువ్వికట్టిన శిఖతో నాజూకు శరీరంతో నవనవలాడుతూ ముప్ఫైలలో ఉన్న యువకుడతను. జాయపుణ్ని చూసి. "అరెరే.. బయటే కూర్చున్నారు. తమరెవరో మహాపురుషుల్లాగా ఉన్నారు?" అన్నాడు ప్రశ్నార్థకంగా. జాయపుడు మాత్రం ఎక్కువమంది పిల్లలు బ్రాహ్మణ ఆహార్యంలో ఉండటం చూస్తున్నాడు. "పురుషుణ్నే కానీ మహాపురుషుణ్ని కాను.." అంటూ నవ్వాడు. "నా పేరు జగన్నాథుడు. అనుమకొండ నివాసిని. నంగెగడ్డలో బంధువులు ఉంటే చూసిపోవడానికి వచ్చి ఉప్పెన బారినపడి ఇక్కడ తేలాను!". "ఆ వ్యక్తి తమరేనా!? విన్నాను. అయితే అనుమకొండ వారన్నమాట. ఆగండాగండి ఆసనం తెస్తాను!". "వద్దొద్దు. ఇంతకన్నా ఉన్నతాసనం ఉంటుందా?" అంటూ బాసింపట్టును పద్మాసనంలోకి మార్చాడు జాయపుడు. "నాపేరు సిద్ధయ. ఊరివాళ్లు భాగోతుల సిద్ధయ అంటారు" చెబుతూ జాయపుని ముందు చతికిలబడ్డాడు. 'తిరునామం పెట్టుకున్నవాళ్లను 'భాగవతులు' అంటూండటం ద్వీపరాజ్యంలో మరీ ఎక్కువగా వినిపిస్తున్నదే!' అనుకున్నాడు జాయపుడు. "ఇదేమిటి.. మీ విద్యార్థులంతా బ్రాహ్మణులేనా.. ఇతరులకు నేర్పరా??!". "అందరూ నాపై చేసే విమర్శ అదే. ఇది పూర్తిగా బ్రాహ్మణ అగ్రహారం. ఇది పాతికగృహాల గ్రామంగా ఉన్నప్పుడే అప్పటి పాలకుడు రాజేంద్రచోళుడు 'కూసెనభట్టు' అనే ఉపాధ్యాయునికి దానం చేశారు. ఇక్కడి కులీనరైతులు పంట సాగుచేసి ధాన్యంవాటాను అగ్రహార వారసునికి ఇస్తారు కానీ, పిల్లలను చదువులకే పంపరు. ఇక నాట్యం అంటే మక్కెలు విరగ్గొడతారు. ఆసక్తిగల పిల్లలు కొందరున్నా.. వాళ్లూ నిత్యమూ తరగతులకు రారు. అందువల్ల చదువే ఏకైకవృత్తిగా గల బ్రాహ్మణ పిల్లలే ఎక్కువగా వస్తారు. అందువల్లనేమో కూసెనపూండిని అందరూ భాగోతుల కూసెనపూండి అంటున్నారు". మరో వాస్తవం చెప్పాడు భాగవత సిద్ధయ. "పంచముల పిల్లలకు కళలంటే ఆసక్తి ఉన్నా.. సామాజిక కట్టుబాట్లు ప్రధాన అడ్డంకి. అగ్రహార పెద్దలు కూడా దైవదత్తమైన కళను పంచములకు నేర్పడం అంతగా ఇష్టపడరు. ఎవరికైనా నాట్యం నేర్పడానికి నా గృహం ఎప్పుడూ తెరిచే ఉంటుంది. ఇన్ని సామాజిక కట్టుబాట్ల మధ్య తరగతికే రానివారికి నాట్యం నేర్పలేను కదా!?". అనుభవంతో ఆయన చెప్పినదాంట్లో వాస్తవం ఉంది. "ఓ రహస్యం.. మనసులో పెట్టుకోండి. నాట్యంపట్ల ఆసక్తి ఉన్న పంచముల పిల్లలకు జంధ్యంవేసి నాట్యం నేర్పుతుంటాను. ఇది చాలామంది గురువులు చేసేపనే! ఆసక్తి ఉన్నవాడికి చెప్పాలన్న దురద గురువులకు ఉండటం సహజం. ఇది తాతల కాలంనుంచి ఉన్న అనుభవమే. ఇప్పుడు గొప్ప నాట్యాచార్యులుగా గుర్తింపు పొందుతున్నవారిలో ఈ తరహా పంచములు కూడా ఉన్నారని మీకు తెలిసి ఉండొచ్చు!". ఆశ్చర్యపోయిన జాయపుడు సిద్ధయతో కలిసి భళ్లున నవ్వాడు అంగీకరిస్తున్నట్లు. అతనికి మువ్వ గుర్తొచ్చింది. ఈయన మువ్వను చూస్తే తప్పక నాట్యం నేర్పేవాడేమో.. కానీ ఆమెకు జంధ్యం వెయ్యడం ఎలా!?.. మళ్లీ నవ్వు తన్నుకురాగా లేచి నమస్కరించాడు. "సంతోషం మీ పరిచయం. రేపు మీ నాట్యాభ్యాసం చూడటానికి అనుజ్ఞ ఇవ్వండి". "అయ్యయ్యో.. రేపే మేము దక్షిణాదికి వెళ్లబోతున్నాం. దాదాపు రెండుమాసాల తర్వాత తిరిగి గ్రామం చేరతాం. అప్పుడు తమరు మా ప్రదర్శనను మీకు చూపే అవకాశం మాకు ఇవ్వండి.." అన్నాడు. "అలాగా!? నాకూ మరిన్ని పనులున్నాయి. లేకుంటే మీతోనే వచ్చేవాణ్ని!" అంటూ.. అతణ్ని సంతోషపుచ్చి వెనుతిరిగాడు. తర్వాత తర్వాత రాజబంధువు జగన్నాథునికి, గొప్ప నాట్యకారుడు, నాట్యగురువు సిద్ధయకు మధ్య అపూర్వ స్నేహం, అనుబంధం ఏర్పడ్డాయి. గుంపులుగా వివిధ సామాజికవర్గాలు వేరువేరు రాజ్యాలకు, మండలాలకు, నాడులకు తరలిపోవడం ఇప్పుడు సర్వసాధారణం. ముఖ్యంగా బ్రాహ్మణులు, పండితులు ఎక్కడ పాలకుల అనుగ్రహం ఉందని తెలుస్తుందో.. అక్కడికి వెళ్లిపోతుంటారు. పంచాణంవారిని అనేక రాజ్యాలవారు నెత్తిన పెట్టుకుంటారు. సేవావృత్తులైన చాకలి, మంగలివాళ్ల కోసం చాలాగ్రామాల రట్టలు బాజాభజంత్రీలతో ఆహ్వానాలు పలుకుతుంటారు. కరువు కాలంలో, అంటువ్యాధుల కాలంలో రైతులు, రైతుకూలీలు దూరరాజ్యాలకు వెళ్లడం కద్దు. రాజాశ్రయమే ముఖ్యమైన ప్రదర్శన కళాబృందాలు సంచారజాతుల్లా ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు. వెలనాడు సంపద్వంతమైన రాజ్యం కావడంతో రైతులు, కూలీలు, వృత్తులవారి కంటే కళాకారబృందాలే ఎక్కువగా వస్తూ పోతూ బాగా సంపాదిస్తుంటారని చెప్పుకొంటారు.రాజు తర్వాత సమాజం పూజించేది కవి పండితులను, నాట్యకారులను అని చెప్పుకొన్నా.. అది జనాభాలో పది శాతమే. తొంభైశాతం జనాభా కళలను ఆరాధిస్తారు కానీ, కళాకారులు కావడానికి వారికి సమయం లేదు. ముఖ్యంగా వాణిజ్యంతో, వ్యవసాయంతో సంపద్వంతమైన వెలనాడు లాంటి రాజ్యాలలో.

## "గొడ్లను మేపుకోవాలి. పొలంలో బోలెడు పని ఉంది!"..

"ఉప్పుడు కాదు. నాయన ఊరుకోడు.. తంతాడు!"..

ఈ సమాధానాలే.. ఎవ్వర్ని అడిగి చూసినా!

తెలతెలవారుతున్నది. వెచ్చని ఉషోదయ పవనాలు గోరింటాకు వర్ణపు భానుకిరణాలను తెచ్చి నిద్రిస్తున్న జాయపుని బుగ్గలకు గోరింటాకు పెడుతున్నాయి. దగ్గరగా ఓ గాత్రం.. తంబుర నాదంతో మేళవించి.. వీధివీధంతా ప్రతిధ్వనిస్తున్నది.

## శివా.. శివోహం! కేశవా.. నమోహం!!

శివ కేశవులకు భేదమా.. సుజ్ఞానవంతులకు వాదమా..
శివా.. శివోహం! కేశవా.. నమోహం!!
పులిచర్మము కట్టే లింగడు.. పట్టు వస్త్రాలు కట్టే రంగడు..
ప్రేమ బూడిద రాసే లింగడు..
పట్టె నామాలెట్టే రంగడు.. ? శివ ?
ఎద్దు నెక్కినవాడు లింగడు.. గ్రద్ద నెక్కినవాడు రంగడు..
పాము పాగా చుట్టే లింగడు.. పాముపైనే పవ్వళించె రంగడు..
? శివ ?
కైలాసగిరి పైన లింగడు.. వైకుంఠపురమందు రంగడు..
శివ కేశవులకు భేదమా.. సుజ్ఞానవంతులకు వాదమా..
శివా.. శివోహం!.. కేశవా.. నమోహం!!

చెళ్లున చరచినట్లయ్యింది. లేచి వేగంగా బయటికి వచ్చాడు. ఓ భిక్షుక గాయకుడు.. తలకు తలపాగా, చిరుగుల కంచుకం, భుజాన జోలె, ముఖాన నిలువు అడ్డబొట్లు, వెలుగుతున్న గరుడ కమ్మ (ఎత్తుదీపం) ఓ చేతిలో, మెడలో పెరికెతాడు కట్టిన ఇత్తడి పళ్లెరంపై కర్రతో శబ్దం చేస్తూ ఇల్లిల్లూ తిరుగుతూ.. భిక్షాటనతో దీవెనలు ఇస్తూ పాడుకుంటూ పోతున్నాడు. హరిహర తత్వగీతం!.. తెలుగు ప్రాంతాలలో వేగంగా విస్తరిస్తున్న మరో మతకోణం! తిక్కనామాత్యులు తదితరులు తీవ్రంగా ప్రచారం చేస్తున్నారని విన్నాడు. అరె.. ఈ అంశం తెలిసినా ఎలా తన మనసు నుంచి తప్పుకొన్నది!? అతని వెనకే వెళ్లి ఆ తత్వగీతం పూర్తిగా విన్నాడు. "ఆయన మాల దాసరిగాడు. భలే భలే పాటలు కడతాడు!".. జాయపుని ఆశ్చర్యం చూసి పొదుంపుల్ల నోట్లో పెట్టుకున్న పౌరుడొకడు వివరణ ఇచ్చాడు. కాస్త ఆవలగా ఇలాగే ఏదో పాడుకుంటూ మరొక దాసరి.. దూరంగా మరొకడు. అక్కడెక్కడో మరో దాసరి గీతం! కాస్త పులకింత కలిగింది జాయపునికి. "అతడు.. ఆ దాసరి ఎక్కడుంటాడు?" అడిగాడా పొదుంపుల్లను. "అటు పో.. గడ్డిపాడు దాటిపో! ఆడ పెద్ద రాయిసెట్టు ఉంటది. ఆడ గుడిసెలుంటయ్. అందరూ దాసరిగాళ్లే! ఇప్పుడంతా అడుక్కోడానికి పోతారు. పొద్దుగుంకే యాలకు వత్తారు!". రోజంతా అస్థిమితంగా గడిపి పొద్దుగుంకే వేళకు గడ్డిపాడు అవతలనున్న ఆ రావిచెట్టు వద్దకు వెళ్లాడు. ఉప్పెన సమయంలో నిలిచిన నీటిచలమ ఎండిపోగా.. తిరిగి తేలిన మెరక నేల అది. సంచారజాతుల చిన్నచిన్న తాత్కాలిక గుడిసెలు. ఆడవాళ్లూ, పిల్లలూ ఉన్నారు. మగవాళ్లు ఎవ్వరూ లేరు. గ్రామ భిక్షాటన నుంచి రాలేదనుకుంటా. రావిచెట్టు మొదట్లోనున్న దిమ్మెపై కూర్చున్నాడు. జాయపునిలాంటి ఆకర్షణీయ విగ్రహం అక్కడ కనిపించడం ఆ మహిళలకు అబ్బురంగా ఉంది. గుడిసెల్లోంచి తొంగి చూస్తున్నారు. అది అలవాటైన జాయపుడు తలవొంచుకుని కూనిరాగం తీస్తూ కూర్చున్నాడు. కాస్త అవతలగా మరో రావిచెట్టు. దాని మొదట్లో చిన్నగూడులా ఓ గుడి. అందులోంచి ఎవరో గ్రామదేవత అనుకుంటా.. దూరానికి కూడా పెద్దపెద్ద కళ్లు.. జాయపుణ్నే చూస్తున్నట్లు. రానురానూ చీకటి ముసురుకుంటున్నది. ఎవరో మహిళ దైవప్రార్థన చేయడం వినిపించింది. ఆశ్చర్యంగా అటు చూశాడు. ఆ గ్రామదేవత ముందు ఓ వృద్ధ మహిళ పాడుతున్నది.

## శివశక్తే నమస్తుభ్యం!!

కళాభ్యాం చూడాలంకృత శశికళాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతుమే
శివాభ్యాం అస్తోక త్రిభువన శివాభ్యాం హృదిపున
ర్భవాభ్యాం ఆనంద స్ఫురదనుభవాభ్యాం నతిరియమ్ ?

చటుక్కున లేచి చూశాడు. ఆమె ఆ చిన్నగుడి ముందు చీపురుతో ఊడుస్తూ పాడుతున్నది. పూచికపుల్ల లాంటి వడలిన శరీరం. కానీ కంఠం మాత్రం ఖంగున మోగుతున్నది. ఉద్వేగంతో కూడిన శ్రావ్యత.. ఆ గొంతులో చిప్పిల్లుతున్నది. గుడిసెల్లోని స్త్రీలు బయటికి వచ్చి నిలబడ్డారు.. భక్తిగా చేతులు జోడించి. ఆమె సాయంకాలపు రంగపూజనం నిర్వహిస్తున్నది. చేతులు వెనక్కి కట్టుకుని వింటూ.. అటుగా నడవసాగాడు. ఊడ్చాక వెంట తెచ్చుకున్న కడవలోని నీళ్లతో కడిగింది. ముగ్గులేసింది. అన్ని సంస్కృత భక్తిగీతాలు. ప్రతిపదానికీ అర్థం తెలిసినట్లు.. మనోధర్మంతో తాదాత్మ్యతతో తడుముకోకుండా పాడుతున్నది. స నుంచి ని వరకు.. అంటే సంగీతం పూర్తిగా తెలిసినవారే.. సాని. ఆమె గుడిసాని కావచ్చు. పాడుతూనే చీర కొంగు నడుంవద్ద దోపి నాట్యానికి సిద్ధమై భంగిమ తీసుకుంది. అప్పుడెప్పుడో కాకతి ఉదయ భోగాలు నిర్వహిస్తుండగా చూశాడు. ఇప్పుడు.. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ సంధ్యా భోగం సమర్పిస్తుండగా చూస్తున్నాడు. చూపు ఆ చిన్నగుడిలోని దేవుడిపైకి పోయింది. చిత్రంగా ఆ దైవరూపం చుట్టూ ఏదో వెలుగు.. చిరుకంపన. పిచ్చెక్కిపోయింది జాయపునికి. నిస్సందేహంగా ఆ దేవుడు ఆమె సమర్పణకు స్పందిస్తున్నాడు. పులకిస్తున్నాడు.

# సినిమా




## మూవీ రివ్యూ : సారంగపాణి జాతకం

**తెలుగులో తెలుగుదనంతో సినిమాలు తీసే.. మంచి అభిరుచి ఉన్న దర్శకుల్లో ఇంద్రగంటి మోహనకృష్ణ ఒకరు.**

**మూవీ రివ్యూ : సారంగపాణి జాతకం**

**'సారంగపాణి జాతకం' మూవీ రివ్యూ**

**నటీనటులు: ప్రియదర్శి-రూప కొడవయూర్-వెన్నెల కిషోర్-నరేష్-అవసరాల శ్రీనివాస్-హర్ష చెముడు-తనికెళ్ల భరణి-శివన్నారాయణ-రాజా చెంబోలు-వడ్లమాని శ్రీనివాస్-ప్రదీప్ రుద్ర తదితరులు**

**సంగీతం: వివేక్ సాగర్**

**ఛాయాగ్రహణం: పి.జి.విందా**

**నిర్మాత: శివలెంక కృష్ణప్రసాద్**

రచన-దర్శకత్వం: ఇంద్రగంటి మోహనకృష్ణ తెలుగులో తెలుగుదనంతో సినిమాలు తీసే.. మంచి అభిరుచి ఉన్న దర్శకుల్లో ఇంద్రగంటి మోహనకృష్ణ ఒకరు. ఓవైపు కమెడియన్ గా రాణిస్తూనే.. మరోవైపు కథానాయకుడిగానూ మంచి సినిమాలు చేస్తున్న

ప్రియదర్శి ప్రధాన పాత్రలో ఇంద్రగంటి రూపొందించిన చిత్రం.. సారంగపాణి జాతకం. చక్కటి ప్రోమోలతో ఆకట్టుకున్న ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

కథ: సారంగపాణి ఒక కార్ షోరూంలో సేల్స్ మన్. తనకు ఆఫీసులో మంచి పేరుంటుంది. అతను ఎంతో ఇష్టపడే మైథిలి తనే వచ్చి సారంగపాణికి ఐలవ్యూ చెబుతుంది. దీంతో అతను గాల్లో తేలిపోతాడు. ఇరు కుటుంబాల అంగీకారంతో వీరి పెళ్లికి రంగం సిద్ధమవుతుంది. కానీ జాతకాల పిచ్చి ఉన్న సారంగపాణి.. ఒక జ్యోతిష్యుడు చెప్పిన మాటతో పెళ్లికి బ్రేక్ వేసేస్తాడు. తానొక హత్య చేస్తానని చేతి రేఖలో ఉందని నమ్మి దానికి తనొక పరిష్కార మార్గం ఎంచుకుంటాడు. ఆ మార్గంలో వెళ్లేసరికి అతడికి లేని పోని సమస్యలు మొదలవుతాయి. ఇంతకీ అతను ఎంచుకున్న ఆ మార్గం ఏంటి.. అందులో అతను అనుకున్నది సాధించాడా.. చివరికి మైథిలితో అతడి పెళ్లి జరిగిందా లేదా అన్నది మిగతా కథ.

కథనం-విశ్లేషణ:

'సారంగపాణి'లో కీలకమైన ఓ పాత్ర పేరు.. అహోబిలం. ఆయన నడిపే హోటల్ పేరు.. 'అహోటల్'. ఆ అహోబిలాన్ని టెర్రస్ మీది నుంచి తోసి చంపేయమని హీరోకు చెబుతూ.. "అదిగో అహో..బిలంలో పడ్డానికి రెడీగా ఉన్నాడు" అంటుంది ఓ పాత్ర. 'సారంగపాణి జాతకం'లో ఇంద్రగంటి మోహనకృష్ణ చమత్కారం ఎలా ఉంటుందో చెప్పానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. తెలుగు ఎంత అందమైన.. అద్భుతమైన భాషో.. దాని మీద పట్టుంటే మాటలతో ఎంత గారడీ చేయొచ్చో చెప్పడానికి 'సారంగపాణి జాతకం' ఓ గొప్ప ఉదాహరణ. ఐతే కానీ ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది ఆ మాటల గారడీ మాత్రమే కావడమే ప్రతికూలాంశం. కథలో కూడా బలమైన విషయం ఉండి.. ప్రేక్షకుడి అంచనాకు అందని కథనం తోడై ఉంటే.. 'సారంగపాణి జాతకం' చాలా ప్రత్యేకమైన సినిమా అయ్యుండేది. చాలా చిన్న పాయింట్ పట్టుకుని మరీ సాగదీయడం వల్ల ఈ సినిమా పూర్తి సంతృప్తినివ్వదు. కానీ కథాకథనాల సంగతి వదిలేసి.. ఏమాత్రం అసభ్యత లేకుండా.. పూర్తిగా తెలుగుదనంతో కూడా కూడిన చక్కటి హాస్య సన్నివేశాలు చూడాలనుకుంటే మాత్రం 'సారంగపాణి జాతకం' మంచి ఛాయిస్. 'సారంగపాణి జాతకం' అని టైటిల్ పెట్టి.. హీరోను జాతకాల పిచ్చోడిగా చూపించారంటేనే.. ఈ కథ ఎలా సాగొచ్చు అన్నదానిపై ఒక అంచనా వచ్చేస్తుంది. జాతకాల మీద అతి నమ్మకంతో లేని పోని కష్టాలు కొని తెచ్చుకుని.. చివరికి లెంపలేసుకోవడంతో ఈ కథకు శుభం కార్డు పడుతుందని ఈజీగా చెప్పేయొచ్చు. ఈ అంచనాకు భిన్నంగా ఏమీ కథను నడిపించలేదు ఇంద్రగంటి మోహనకృష్ణ. సాఫీగా సాగిపోతున్న జీవితాన్ని జాతకాల పిచ్చితో హీరో నరకప్రాయం చేసుకుంటుంటే.. చూడ్డానికి చికాగ్గానే అనిపిస్తుంది. కానీ పాత్రల తాలూకు ఈ మూర?త్వాన్నే ఆసరాగా చేసుకుని కామెడీ పండించడానికి అవకాశముంటుంది. ఇంద్రగంటి అదే చేశాడు. తన జాతకంలో హత్య చేసే రేఖ ఉందని.. తనకు తానుగా ఓ దుష్టసంహారం చేసి ఈ సమస్య నుంచి బయటపడాలని హీరో చేసే ప్రయత్నాలు ఫన్నీగా అనిపిస్తాయి. తన జాతకంలో ఉన్న దోషాన్ని కవర్ చేయడం కోసం హీరో వేసే ఎత్తుగడలు.. అవి బెడిసికొట్టి అతను పడే పాట్ల నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను బాగానే నవ్విస్తాయి. ఐతే ఒక దశ దాటాక హీరో ప్రవర్తన శ్రుతి మించడం.. అతడి మూర?త్వం పరాకాష్టకు చేరడంతో ప్రేక్షకులకు ఉక్కపోత తప్పదు. ద్వితీయార్ధంలో సన్నివేశాలు మరీ సిల్లీగా.. ఇల్లాజికల్ గా సాగుతాయి. అక్కడక్కడా కామెడీ పండినా సరే.. సన్నివేశాలు లాజిక్ కు మరీ దూరంగా సాగడంతో ద్వితీయార్ధంలో కామెడీ అనుకున్నంతగా పండలేదు. ప్రతి సన్నివేశంలోనూ సంభాషణల్లో చాతుర్యానికి లోటు లేకపోయినా.. ఒక జోక్ అర్థం చేసుకునేలోపే ఇంకో జోక్ వచ్చి పడుతున్నా.. కథ మాత్రం మరీ రొటీన్ గా.. కొంత కృత్రిమంగానూ తయారై.. లాజిక్ పూర్తిగా కొండెక్కేయడంతో ఇబ్బంది తప్పదు. చివరి అరగంటలో ముఖ్య పాత్రలన్నింటినీ ఒక చోటికి తెచ్చేసి కామెడీ ఆఫ్ ఎర్రర్స్ తో నవ్వించడానికి ఇంద్రగంటి ప్రయత్నించాడు. కొంత నవ్వుకున్నప్పటికీ.. తెరంతా మరీ కంగాళీగా తయారై మిశ్రమానుభూతి కలుగుతుంది. కథలోని ట్విస్టును.. ముగింపును ఊహించడం కష్టమేమీ కాదు. ముందే చెప్పుకున్నట్లు ఇందులో ఇంద్రగంటి సంభాషణల చాతుర్యం మాత్రం వేరే లెవెల్. ఆస్వాదించిన వాడికి ఆస్వాదించినంత అన్నట్లుంటాయి డైలాగులు. కామెడీ పేలిపోయే స్థాయిలో లేదు కానీ.. ఓ మోస్తరుగా నవ్వులు పండాయి. ఫ్యామిలీ అంతా చూసి ఎంజాయ్ చేయగలిగే క్లీన్ కామెడీతో సినిమా సాగడం ప్లస్. కథాకథనాలు బలహీనమైనప్పటికీ.. ఇది ఓసారి చూడ్డానికి ఢోకా లేని టైంపాస్ కామెడీనే.

నటీనటులు: ప్రియదర్శి రూపంలో ప్రధాన పాత్రకు సరైన నటుడినే ఎంచుకున్నాడు ఇంద్రగంటి. పాత్రను అర్థం చేసుకుని అందుకు తగ్గట్లుగా బాగా నటించాడు ప్రియదర్శి. తన ఫిల్మోగ్రఫీలో ఇది మరో ప్రత్యేకమైన పాత్ర అని చెప్పొచ్చు. స్వతహాగా కమెడియన్ కాబట్టి.. కామెడీ టచ్ ఉన్న పాత్ర చేయడంలో అతనేమీ ఇబ్బంది పడలేదు. రూప కొడవయూర్ కూడా బాగా చేసింది. ఇంద్రగంటి మార్కు హీరోయిన్ పాత్రలో ఆమె సులువుగా ఒదిగిపోయింది. హీరోతో సమానమైన స్క్రీన్ టైం ఉన్న పాత్రలో వెన్నెల కిషోర్ అదరగొట్టాడు. ఈ మధ్య కాలంలో కిషోర్ బాగా నవ్వించిన పాత్రల్లో ఇదొకటి. అవసరాల శ్రీనివాస్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో రాణించాడు. తనికెళ్ల భరణి కనిపించిన కాసేపు తన ప్రత్యేకతను చాటుకున్నారు. నరేష్.. వడ్డమాని శ్రీనివాస్.. హర్ష చెముడు.. వీళ్లంతా కామెడీ విషయంలో తలో చేయి వేశారు. రాజా చెంబోలుది మామూలు పాత్రే.

సాంకేతిక వర్గం: వివేక్ సాగర్ రెండు పాటల్లో తన ముద్రను చూపించాడు. 'సారంగా..' పాట వినసొంపుగా.. హుషారుగా సాగింది. ఇంకో పాట కూడా బాగుంది. ఐతే పాటలకు అంత ప్రాధాన్యమున్న కథ కాదిది. వివేక్ నేపథ్య సంగీతం సినిమా శైలికి తగ్గట్లుగా సాగింది. పి.జి.విందా విజువల్స్ కంటికి ఇంపుగా కనిపిస్తాయి. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. చిన్న సినిమా అనే ఫీలింగ్ రాకుండా రిచ్ గా తీశారు నిర్మాత. ఇక ఇంద్రగంటి కథా రచయితగా నిరాశపరిచినా.. సంభాషణల్లో మాత్రం మెరుపులు మెరిపించాడు. "వాడు ఆల్ఫా మేల్ ఏంటమ్మా.. అల్పుడైతేనూ".. లాంటి చమక్కులు సినిమాలో బోలెడున్నాయి. మనసు పెట్టి విని ఆస్వాదించకపోతే..

సన్నివేశాల వేగంలో కొట్టుకుపోయే మెరుపులు చాలానే ఉన్నాయి. ఐతే ఇంద్రగంటి ఎంచుకున్న కథే మరీ పలుచగా అనిపిస్తుంది. చిన్న పాయింట్ పట్టుకుని మరీ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. కథలో పెద్దగా మలుపులు లేకపోవడం మైనస్. కానీ కామెడీ సన్నివేశాలను.. డైలాగులను ఎంజాయ్ చేయడం మొదలుపెడితే కథ సంగతి పెద్దగా పట్టింపు ఉండకపోవచ్చు.

చివరగా:

సారంగపాణి జాతకం.. సగటు కథలో సరదాగా కాసేపు


రేటింగ్- 2.5/5






## వరుణ్ డిజాస్టర్ మూవీ.. వెబ్ సిరీస్ గా వస్తుందా?

టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్ గురించి అందరికీ తెలిసిందే. మెగా కాంపౌండ్ నుంచి వచ్చిన ప్రిన్స్.. తనకంటూ స్పెషల్ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. వైవిధ్యమైన ప్రాజెక్టులకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచారు. కానీ కొంత కాలంగా సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. ఎందుకో గానీ.. ఆయన సినిమాలు క్లిక్ అవ్వడం లేదు. గత ఏడాది రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన వరుణ్.. అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోయారు. అందులో ఒకటైన మట్కా సినిమాలో ఆయన వివిధ భిన్నమైన రోల్స్ లో సందడి చేశారు. బాక్సాఫీస్ వద్ద సినిమా డిజాస్టర్ గా మారినా.. వరుణ్ తేజ్ మాత్రం తన లుక్స్ అండ్ యాక్టింగ్ టాలెంట్ తో అలరించారని చెప్పాలి. అయితే మట్కా మూవీ కోసం ఇప్పుడెందుకు చర్చ అనుకుంటున్నారా? నిజానికి.. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా ఆయన తాను నటిస్తున్న మట్కా కింగ్ వెబ్ సిరీస్ షూటింగ్ ను పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఓ కేక్ తో పాటు రెడ్ క్లాత్ ఉన్న పిక్ ను షేర్ చేశారు. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవ్వనున్న ఆ సిరీస్ కు సైరత్ ఫేమ్ నాగరాజ్ మంజులే దర్శకత్వం వహిస్తున్నారు. సిద్ధార్థ్ రాయ్ కపూర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అయితే మట్కా కింగ్ సిరీస్.. ముంబయిలో గ్యాంబ్లింగ్ బ్యాక్ డ్రాప్ తో తీస్తున్నట్లు తెలుస్తోంది. 60స్ కాలం నాటి కథతో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో మట్కా కింగ్ సిరీస్ కథాంశం.. వరుణ్ మట్కా స్టోరీలా అనిపిస్తుందని చెప్పాలి. అయితే అప్పుడు డిజాస్టర్ అయిన మట్కా మూవీ.. ఇప్పుడు ఓటీటీలో సిరీస్ రూపంలో తీసుకొస్తున్నారా అని నెటిజన్లు క్వశ్చన్ చేస్తున్నారు. మట్కా స్టోరీ లైన్ తీసుకుని కొత్తగా తీశారేమోనని ఇంకొందరు మూవీ లవర్స్ కామెంట్స్ పెడుతున్నారు. అయితే నాగరాజ్ మంజులే మంచి టాలెంట్ ఉన్న డైరెక్టర్ అన్న విషయం తెలిసిందే. బెస్ట్ అవుట్ పుట్ ఇవ్వడానికి ట్రై చేస్తుంటారు. విజయ్ వర్మ తన యాక్టింగ్ తో ఎప్పుడూ మెప్పిస్తుంటారు. ఆయనతోపాటు సిరీస్ లో గుల్షన్ గ్రోవర్, కృతికా కమ్రా, సాయి తమ్హాంకర్ సహా పలువురు ఉన్నారు. మరి మట్కా కింగ్ వెబ్ సిరీస్ ఎలా ఉంటుందో.. ప్రేక్షకులను మెప్పిస్తుందో లేదో వేచి చూడాలి.




## శివనామస్మరణ తో ఇండియా మోతెక్కాల్సిందే!




శివయ్యపై సినిమాలు కొత్తేం కాదు. శివుడిపై నాటి రోజుల్లో ఎన్నోహిట్ చిత్రాలున్నాయి. ఆ తర్వాత కాలంలో ట్రెండ్ కు తగ్గట్టు శివయ్యపై సినిమాలొచ్చాయి. అయితే ఇప్పుడు మరింత అడ్వాన్స్ గా శివనాస్మరణను టాలీవుడ్ ఎన్ క్యాష్ చేసుకుంటుంది. పౌరాణిక-ఫాంటసీ చిత్రాలు ట్రెండ్ గా మారడంతో? శివయ్యను ఎక్కువగా హైలైట్ చేస్తున్నారు. ఇటీవలే తమన్నా నటించిన - ఓదెల2 - అలాంటి కాన్సెప్ట్ తోనే తెరకెక్కింది. అలాగే - శివం భజే - శివుడు కీలకంగా రూపొందింది. ఈ రెండు ఈ మధ్య కాలంలో రిలీజ్ అయి మంచి ఫలితాలు సాధించాయి. తాజాగా పాన్ ఇండియాలో శివ నామస్మరణకు రంగం సిద్దమవుతోంది. మంచు విష్ణు ప్రతిష్టాత్మకంగా - కన్నప్ప - ప్రాజెక్ట్ ను పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. మంచు ఫ్యామిలీకి ఈ సినిమా ఓ డ్రీమ్ ప్రాజెక్ట్. ఎంతో కాలంగా కన్నప్ప తీయాలని ప్లాన్ చేసుకుని చిరవిగా ఈ ఏడాది రిలీజ్ కి రెడీ అవుతోంది. ఇందులో శివును భక్తుడు కన్నప్ప కథ ఆధారంగా తెరకెక్కింది. భారీ కాన్వాస్ పై రూపొందుతున్న చిత్ర మిది. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, మధు ప్రీతి ముకుందన్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాకు పాజిటివ్ బజ్ మొదలైంది. సిజీ పనులు ఆలస్యమవుతోన్న నేపథ్యంలో రిలీజ్ డిలే అవుతోంది. జూన్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అలాగే పాన్ ఇండియాలో నటసింహ బాలకృష్ణ నటిస్తోన్న %-%అఖండ2 - మరింత ప్రతిష్టాత్మకంగా రిలీజ్ అవుతుంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తోన్న చిత్రంలో బాలయ్య అఘోరిపాత్రలో విశ్వరూపం చూపించబోతున్నారు. ప్రత్యేకంగా కుంభమేళా కూడా కలిసి రావడంతో? అక్కడ సన్నివేశాలు సినిమాకు హైలైట్ గా ఉంటాయని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. అఘోర పాత్రలో బాలయ్య నట విశ్వరూపం చూపిస్తారని అంచనాలు భారీగా ఉన్నాయి. అలాగే సుధీర్ బాబు హీరోగా నటించిన జఠాధర కూడా శివుడి కాన్సెప్ట్ ని ఆధారంగా చేసుకునే తెరకెక్కించారు. ఇంకా యంగ్ హీరోలు సాయి శ్రీనివాస్ నటిస్తోన్న - హైంధవ -, అరవింద్ కృష్ణ నటిస్తోన్న - ఎ మాస్టర్ పీస్ - శివుడి కథ ఆధారంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

## ఆ రూ.2500 చెక్ బౌన్స్ : నాని

నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్ 3' సినిమా విడుదలకు సిద్ధం అయింది. శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన హిట్ 1, హిట్ 2 సినిమాలు సక్సెస్ అయిన నేపథ్యంలో హిట్ 3 పై అంచనాలు భారీగా ఉన్నాయి. మొదటి హిట్‌లో విశ్వక్ సేన్ నటించగా, రెండో హిట్‌లో అడవి శేష్ నటించారు. ఆ రెండు సినిమాలను మించి, కంటెంట్ విషయంలో నెవ్వర్ బిఫోర్ అనే విధంగా హిట్ 3 ఉంటుందనే నమ్మకంను దర్శకుడు శైలేష్ కొలను ఇటీవల ఒక సందర్భంగా చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో హీరోగా నటించడంతో పాటు నాని ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించడం విశేషం. అందుకే ఈ సినిమాపై అంచనాలు మరింత ఉన్నాయి. హిట్ 3 సినిమా షూటింగ్ ప్రారంభం అయిన సమయంలో విడుదల చేసిన వీడియోతో అంచనాలు ఆకాశానికి పెరిగిన విషయం తెల్సిందే. హిట్ ఫ్రాంచైజీలో మరిన్ని సినిమాలు వచ్చే విధంగా, ప్రతి ఫ్రాంచైజీ సినిమాపై అంచనాలు పెంచే విధంగా హిట్ 3 ఉంటుంది అంటూ మేకర్స్ బలంగా చెబుతున్నారు. నాని ఈ సినిమాలో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గానే కాకుండా, ఇప్పటి వరకు కనిపించని వైవిధ్యభరిత పాత్రలో కనిపించబోతున్నాడు. యాక్షన్ సన్నివేశాలు ఎక్కువ అయ్యాయని, హింస మరీ ఎక్కువ ఉందని స్వయంగా చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. హిట్ 3 పై చాలా నమ్మకంతో ఉన్న నాని ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాని మాట్లాడుతూ... హిట్ 3 లో విశ్వక్ సేన్, అడవి శేష్ ఉన్నారా? లేరా? అనే విషయాలను చెప్పలేను. కానీ సినిమాలో చాలా సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. కొన్ని సస్పెన్స్ ఎలిమెంట్స్‌కి షాక్ అవుతారు. హిట్ 3 అందరికీ నచ్చే విధంగా ఉంటుందని నాని చెప్పుకొచ్చాడు. మెగాస్టార్ చిరంజీవి గారు నన్ను నమ్మి.. నా బ్యానర్‌లో సినిమాను చేసేందుకు ఒప్పుకోవడం గొప్ప విషయం. ఆయన ప్రశంసలు నాకు ప్రపంచంలోనే అతి పెద్ద అవార్డ్. ఆయన సినీ కెరీర్ 75 శాతం పూర్తి అయిన తర్వాత నేను ఇండస్ట్రీలో అడుగు పెట్టాను. అలాంటి గొప్ప నటుడు నన్ను నమ్మడంను ఎప్పటికీ మరచిపోలేను అన్నాడు. యాంకర్ సుమతో జరిపిన చిట్ చాట్‌లో నాని ఇంకా పలు విషయాలను చెప్పుకొచ్చాడు. అష్టా చమ్మా సినిమాతోనే నేను ఇండస్ట్రీలో అడుగు పెట్టలేదు. అంతకు ముందు నుంచే నేను ఏడు ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. ఆ కష్టం చాలా ఉంటుంది. నాకు ఇండస్ట్రీలో వచ్చిన మొదటి శాలరీ రూ.4000 లు. అంతకు ముందు ఒక సినిమాకు వర్క్ చేసినందుకు గాను రూ.2500 చెక్ ఇచ్చారు. ఆ చెక్‌ను బ్యాంక్‌లో వేసిన సమయంలో బౌన్స్ అయింది. నా మొదటి పారితోషికంకు సంబంధించిన ఆ బౌన్స్ చెక్ ఇప్పటికీ నా వద్ద ఉంది. ఆ చెక్ ద్వారా డబ్బులు రాకున్నా నాకు అదో గుర్తుగా ఉందని నాని సరదాగా చెప్పుకొచ్చాడు. ఇండస్ట్రీలో తాను అందుకున్న మొదటి శాలరీ రూ.4000 లు కాగా, నిర్మాతగా తాను ఇచ్చిన మొదటి చెక్ ఎంత అంటే మాత్రం నాని గుర్తు లేదని సమాధానం దాటవేశాడు. హిట్ 3 తర్వాత నాని 'ది ప్యారడైజ్' సినిమాతో ప్రనేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆ సినిమా గురించి ప్రశ్నించిన సమయంలో నాని స్పందిస్తూ... అది చాలా డిఫరెంట్ సినిమా. ఇప్పటి వరకు అలాంటి సినిమా రాలేదని కచ్చితంగా చెప్పగలను అన్నాడు. ఈ రెండు సినిమాలతో నాని ఇండస్ట్రీలో పది మెట్లు పైకి ఎక్కుతాడని అభిమానులు చాలా నమ్మకంగా ఉన్నారు.



## శ్రీవల్లి లేని పుష్పని జనాలు చూస్తారా..?

సుకుమార్ అల్లు అర్జున్ కాంబినేషన్ లో వచ్చిన పుష్ప రెండు భాగాలు రికార్డులు సృష్టించాయి. పుష్ప 1 ఒక రేంజ్ లో సక్సెస్ కాగా పుష్ప 2 పాన్ ఇండియా రికార్డులు కొల్లగొట్టింది. అల్లు అర్జున్ పూనకాలు తెప్పించే పర్ఫార్మెన్స్ పార్ట్ 1 కే నేషనల్ అవార్డ్ వచ్చేలా చేయగా పుష్ప 2 సినిమాతో కూడా మరోసారి అవార్డ్ గ్యారెంటీ అనిపించేశాడు. ఇక పుష్ప రెండు భాగాల్లో రష్మిక కూడా అదరగొట్టేసింది.శ్రీవల్లి పాత్రలో అమ్మడి యాక్టింగ్ సూపర్ అనిపించేసింది. ముఖ్యంగా పుష్ప 2 లో ఒక లెంగ్త్ డైలాగ్ లో అదరగొట్టేసింది రష్మిక. అంతేనా సాంగ్స్ లో అల్లు అర్జున్ కి ధీటుగా డ్యాన్స్ తో ఇంప్రెస్ చేసింది రష్మిక. ఐతే పుష్ప 2 చివర్లో పాత్రలన్నిటినీ ముగించేశాడు సుకుమార్. ఫ్యామిలీని మొత్తం బ్లాస్టింగ్ లో లేపేశారు. కేవలం పుష్ప రాజ్ ఒక్కడే మిగులుతాడు.మిగతా కథ అంతా అంటే పార్ట్ 3 అంతా కూడా అల్లు అర్జున్ ఒక్కడే నడిపిస్తాడు. పుష్ప పార్ట్ 3 ర్యాంపేజ్ లో శ్రీవల్లి కూడా ఉండటం కష్టమని చెప్పొచ్చు. సో హీరోయిన్ పాత్ర మూడో భాగం లో ఉండే ఛాన్స్ లేదు. ఒకవేళ పుష్ప 3 లో కొత్త హీరోయిన్ ని ఎవరినైనా తీసుకుంటాడా అన్నది తెలియాల్సి ఉంది. పుష్ప 3 విషయంలో సుకుమార్ ఆలోచన ఏంటి అతను ఏం చేయాలని అనుకుంటున్నాడు అన్నది తెలియాల్సి ఉంది. పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ అట్లీ తో సినిమా లాక్ చేసుకున్నాడు. ఈ సినిమా రెండేళ్లలో పూర్తి చేసి ఆ తర్వాత పుష్ప 3 కి రెడీ అయ్యేలా షెడ్యూల్ ప్లాన్ చేసుకున్నాడు. పుష్ప 2 టైం లోనే పుష్ప 3 కి దాచిన రష్ అంతా అలానే ఉంది. ఈలోగా సుకుమార్ కూడా రాం చరణ్ తో ఒక సినిమా ప్లానింగ్ లో ఉన్నాడు. మరి పుష్ప 3 కోసం ఆడియన్స్ ని వెయిటింగ్ చేయించేలా ఉన్నారు ఈ టీం. ఆమధ్య ఒక ఈవెంట్ లో 2028 లో పుష్ప 3 వస్తుందని నిర్మాత అన్నారు. కానీ అది సాధ్యం అయ్యే పరిస్థితి కనిపించట్లేదు.



Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332